# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 46 సంచిక : 5 విజయవాడ 5-7-2013 పేజీలు : 8 వెల : రు 5.00


లోపలి పేజీల్లో...


- బ్రెజిల్, గ్రీసు, టర్కీలలో ప్రజాందోళనలు
- గ్రామీణరుణం : సమ్మిళిత ఆర్థికాభివృద్ధి ఓ ఎండమావి
- కనీస మద్దతు ధరలు - అడకత్తెరలో రైతాంగం
- 'భారత జీవసాంకేతిక నియంత్రణాధికార సంస్థ' ఏర్పాటుకు భారత పాలకుల తహతహ
- ఫ్యూడల్ నీతికి కాపలాభటులు
- భూపంపిణీ బూటకాన్ని వెల్లడించిన గ్రామీణపేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) నివేదిక
- యురేనియం తవ్వకాలను అనంతపురం జిల్లాకు విస్తరించే ప్రయత్నాలు


## దోపిడీ పాలకుల స్వార్థ, నిర్లక్ష్య విధానాల ఫలితమే ఉత్తరాఖండ్‌ను ముంచెత్తిన వరద బీభత్సం

**ఎండాకాలం** వస్తే జనం పిట్టల్లా రాలిపోతారు. శీతాకాలం వస్తే గడ్డకట్టుకుపోయి ప్రాణాలు కోల్పోతారు. వానాకాలం వస్తే వరదల్లో అంతుచిక్కకుండా కొట్టుకుపోతారు. ప్రతిసారీ పాలకులు ప్రకృతి కన్నెర్రజేసిందంటూ జోకొట్టచూస్తారు. అభివృద్ధిహోరు తప్ప, ప్రకృతి సహజసిద్ధ ప్రక్రియల ముందు సామాన్యపౌరులను నిస్సహాయులుగా నిలపటం తప్ప వాటిని మానవ ఆవాసాలకు అనుకూలంగా మార్చుకునే ప్రణాళికలూ విధానాలూ ఉండవు. జలవనరులను, వర్షపు నీరును వృధాకాకుండా పథకాలు, విధానాలు రూపొందించి అమలుజరపని పాలకుల విధానాల ఫలితంగా ప్రతిసంవత్సరం దేశంలోని అనేక ప్రాంతాల్లో కరువు-వరదలు సంభవించి ఆస్థినష్టం -ప్రాణనష్టం జరుగుతూనే ఉంది. నేడు ఉత్తరాఖండ్‌లో కొనసాగుతున్న వరదబీభత్సం అందులో భాగమే.

ఉత్తరాఖండ్‌లో కురిసిన భారీవర్షాలకు భగీరథి, మందాకిని, అలకనంద నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరదనీటి ప్రవాహంలో అనేక గ్రామలు, పట్టణాలు కొట్టుకుపోయాయి. నీటిప్రవాహానికి పునాదితో సహా వరదనీటిలో కొట్టుకుపోయిన దృశ్యాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. వరదనీటితో కొట్టుకుపోయి, కొండచరియలు మీదపడి వేలాదిమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వేలాది గుర్రాలు ప్రాణాలు విడిచాయి. ఎక్కడ చూసినా శవాల గుట్టలే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కేదార్‌నాథ్, బదిరీనాద్, హేమ్‌కుండ్ ప్రాంతాల్లో ఎటుచూసినా తెగిపడిన అవయవాలు, మృతదేహాలు, కుప్పకూలిన భవనాలతో జనసంచారం లేక స్మశానాన్ని తలపిస్తున్నది. కొండచరియల క్రింద, మట్టిదిబ్బల క్రింద వేలాది శవాలు పడిఉన్నాయి. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కి చెందినవారు ఉన్నారు. లెక్కకు అందని విధంగా మృతుల సంఖ్యతోపాటు, 14వేలమంది జాడ తెలియకుండా పోయింది. ఇప్పటికీ 20వేల మందివరకు జలదిగ్బంధంలోనే ఉన్నారు.

### జలదిగ్బంధంలో యాత్రికులు

ఉత్తరాఖండ్‌లోని సమోర జిల్లాలోని హిమనగాల సానువుల్లో ఉన్న బదిరీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి దేవాలయాలను సందర్శించటానికి ఈ కాలంలోనే తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ మొదలుకొని జమ్మూకాశ్మీర్ వరకు లక్షలాదిమంది ప్రతిసంవత్సరం వచ్చిపోతుంటారు. ఈ సంవత్సరం కూడా అలాగే వెళ్ళారు. ఆంధ్రప్రదేశ్ నుండి 2700మంది వెళ్ళినట్లు ప్రభుత్వం ప్రకటించింది. దేవాలయాలను సందర్శించుకునేందుకు అడవిలో ప్రయాణిస్తుండగా వర్షాలు ప్రారంభమై వరద ముంచెత్తటం, కొండచరియలు విరిగిపడటంతో అడుగుతీసి అడుగు వేయటం యాత్రికులకు సాధ్యం కాలేదు. ఎటూ వెళ్లేదారి కన్పించక ప్రాణభయంతో తల్లడిల్లిపోయారు. కొండచరియలు విరిగిపడి, కళ్ళముందే తమ కుటుంబసభ్యులు, తోటి ప్రయాణికులు బండలు క్రింద నలిగి ప్రాణాలు విడుస్తుంటే, వరద ప్రవాహంలో కొట్టుకుపోతుంటే ఏమీచేయలేని నిస్సహాయస్థితిలో స్థాణువుల్లా ఉండిపోయారు. ఎప్పుడు ఎలా ప్రాణాలు కోల్పోవలసివస్తుందోనన్న భయం, మరొకవైపు కారుచీకటి, శరీరం వంకర్లుపోయే చలితోపాటు, మంచినీరు, ఆహారంలేక రోజల తరబడి అల్లాడి బ్రతికున్న శవాల్లాగా మారారు. ప్రాణాలు నిలబెట్టుకోవటానికి బురదనీరు త్రాగి అంటురోగాలపాలై అనేకమంది ప్రాణాలు కోల్పోయారు.

పుణ్యతీర్థాల దర్శనానికి వచ్చిన యాత్రికులకు ఎదురైన కష్టాల గురించి, తప్పిపోయిన వారి గురించి కథనాలపై పత్రికలు, టీవీలు కేంద్రీకరించాయి. స్థానిక ప్రజల గురించి అవి పట్టించుకోలేదు. చార్‌థామ్ దర్శనానికి దాదాపుగా రోజూ లక్షమంది యాత్రికులు వస్తారు. వారి అవసరాలను తీరుస్తూ రోడ్డుప్రక్కన చిన్న చిన్న వ్యాపారాలు సాగించేవారంతా ఉత్తరాఖండ్‌లోని మందాకినీ మైదానగ్రామాల నుండి వచ్చిన యువకులే. ఈ యాత్ర కాలంలో వారు పొందిన ఆదాయంతోనే వారి కుటుంబాలు ఏడాదిపొడవునా జీవనం సాగిస్తాయి. వరద ముంపుకు గురికాకపోయినా ఈ దిగువ గ్రామాలలో యువకులు కన్పించనిస్థితి నెలకొంది. ఎంతమంది యువకులు వరదలకు బలయ్యారో అంచనావేసే ప్రయత్నాలు కూడా లేవు.

వరద ముంపుకు గురై ఎగువ గ్రామాలు విధ్వంసమయ్యాయి. దాదాపు 200గ్రామాలు పూర్తిగా మునిగిపోయాయి. వీరిలో ఎంతమంది వరద భీభత్సానికి విగత జీవులయ్యారో, నిర్వాసితులయ్యారో అంచనాలు కూడా లేవు. వీరికందిస్తున్న సహాయచర్యల గురించి అధికారిక సమాచారమేమీలేదంటేనే పాలకుల నిర్లక్ష్యం ఏ స్థాయిలోవుందో అర్ధమౌతుంది.

### ముందుజాగ్రత్తలు తీసుకోని ప్రభుత్వం

ఈ సంవత్సరం 10రోజుల ముందుగా రుతుపవనాలు ప్రవేశించాయని, కుండపోత వర్షాలు కురుస్తాయని ఈనెల 13వ తేదీనుండి మూడు రోజులుగా వాతావరణ కేంద్రం ప్రసారం చేసింది. ఈ హెచ్చరికల ప్రాధాన్యతను కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి అందుకు అనుగుణమైన చర్యలు చేపట్టటంలో పూర్తిగా విఫలమైనాయి. రానున్న ప్రమాదం గురించి, ప్రజలకు-యాత్రికులకు తెలియచేయటంలోనూ, వారి ప్రయాణాలను నిలుపుదల చేయించి, సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టటంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనాయి. ప్రభుత్వాల నిర్లక్ష్యం ఫలితంగా వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు.

2007లో విపత్తుల నివారణకు సంబంధించిన యంత్రాంగం ఏర్పాటు అయినా, దానికి విధానాలు, మార్గదర్శకాలు లేవు. పొంచివున్న ప్రమాదాల గురించి ముందుగా అంచనావేసిన దాఖలాలు లేవు. పాలకులు కూడా అలాంటి పరిజ్ఞానాన్ని అందించే వాటిని ఆ యంత్రాంగానికి సమకూర్చలేదు. విపత్తులు ఏర్పడినప్పుడు పరిస్థితులను సమీక్షించటం, సహాయకచర్యలు గురించి ఏకరవుపెట్టటం తప్ప అది ఏమీచేయలేని, అలంకార ప్రాయంగా ఉంది.

### ఉపద్రవానికి కారణాలు

ఉత్తరాఖండ్‌లో నమోదు అయిన వర్షపాతాన్ని పరిగణలోకి తీసుకొంటే ఇంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదు అయిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి సందర్భాలల్లో ఇప్పుడు జరిగినంత నష్టం జరగలేదు. అందుకు కారణం ఏమిటన్న ప్రశ్నరాక తప్పదు. ఈ ప్రాంతమంతా లోయలు, కొండలు, అడవితో కూడుకొని ఉంటుంది. ఎత్తు ప్రదేశంలోని అడవి చెట్ల నుండి ఆకులు రాలిపడి క్రింద భూమిమీద పడి మట్టిలో కలిసిపోతాయి. మట్టి ఆకులతో పొరలుపొరలుగా గట్టిపడుతుంది. కొండలపై నుండి జాలువారే వర్షపునీటిలో

(తరువాయి 2వ పేజీలో)

## రాహుల్‌గాంధీ-నరేంద్రమోడీ - బడా బూర్జువాలు

**సమాజంలో** నాయకులెలా పుడతారు? జననేతలుగా ఎలా ముందుకు వస్తారు? ఈ సమయంలో ఇది ముఖ్యమైన ప్రశ్న. లోక్‌సభకు ఎన్నికలు దగ్గర పడుతూండటంతో భారత దేశానికి నాయకత్వ మందిస్తామంటూ కొందరు వ్యక్తులు ముందుకు వస్తున్నారు. వారి ఉత్సాహమంతా వారాడుతున్న నాటకాలలో కన్పిస్తుంది. భారత్‌కు నాయకత్వమందించటమంటే వారి అసలు అర్థం ప్రధానమంత్రి పదవి నధిరోహించటమే. భారత భావిప్రధానిగా తమను తాము చూపెట్టుకుంటున్న వీరు దివ్యపురుషుల్లా మాట్లాడుతున్నారు. ప్రజలనుద్ధరించడానికి పుట్టినట్లు మాట్లాడుతున్నారు. భారత ప్రజలేం కోరుకుంటున్నారన్నది వారికి ప్రధానంకాదు. కాబోయే ప్రధానిగా తమని తామెలా చూపెట్టుకోగలుగుతున్నామన్నదే వారి ప్రయత్నమంతా. తమ సరుకుల అమ్మకం కొరకు అందమైన పాకింగులో మరింత అందమైన వాణిజ్య ప్రచారంతో కంపెనీలు సాగించే ప్రచారార్భాటమంతా ఇక్కడ కన్పిస్తున్నది. ఆ సరుకు అవసరాలు తీర్చుతుందా లేదా అన్నది కాదు; ఆ సరుకు లేకపోతే జీవితానందాన్నే కోల్పోయిన భావాన్ని కల్పించి అమ్మకాలు పెంచుకునే తీరులోనే అడ్వర్టైజ్‌మెంటు కంపెనీల సలహాలతో వేషభాషలనుండి నినాదాల వరకూ సాగుతున్న ప్రచార వ్యూహం రాబోయే నెలల్లో ఎన్ని కుల, మత, ప్రాంతీయ, జాతీయ లాబీయింగు అవతారాలెత్తుతుందో ఊహకందని విషయమేమీ కాదు.

కాంగ్రెసు పార్టీ చాలా కాలంగా నెహ్రూ కుటుంబ వారసులను నెత్తిన పెట్టుకుమోస్తున్నది. ముని మనుమడి వారసత్వంపట్ల స్వామిభక్తిని ప్రదర్శించటంలో పోటీపడటానికి కాంగ్రెసు నాయకులెవరూ సిగ్గుపడరు. రాహుల్‌గాంధీని ప్రధాని పదవి చేపట్టి దేశాన్ని కాపాడమని కోరటమే కాంగ్రెసు రోజువారీ కార్యక్రమమైంది. ఇదెక్కడ ఎబ్బెట్టుగా కన్పిస్తుందోనన్నట్లుగా స్వయంగా రాహుల్‌గాంధీయే సిగ్గు నటిస్తున్నాడు. పదవి తనకు ముఖ్యంకాదని ప్రజాక్షేమానికే ప్రధమస్థానమంటూ తన స్వార్ధరాహిత్యాన్ని పొగిడే అవకాశం కల్పిస్తున్నాడు. ప్రధాని పదవికి కాంగ్రెసు అభ్యర్థిగా తన స్థానాన్ని పదిలపరచుకుంటున్నాడు.

భారత్‌కు కాబోయే ప్రధానిగా బిజెపి నరేంద్ర మోడీని ముందుకు తెస్తున్నది. కానీ ఈయన అభ్యర్థిత్వానికి బిజెపి లోపల నుండేకాక ఎన్‌డిఏ భాగస్వామ్యపక్షాల నుండి కూడా వ్యతిరేకత వస్తున్నది. గుజరాత్ వెలుగే భారత వెలుగుగా చిత్రిస్తూ బిజెపి మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ నరేంద్రమోడీని ముందుకు తెస్తున్నది. దీనితో తననుతానే భావిప్రధానిగా చూపెట్టుకోవాల్సిన స్థితిలో మోడీ వున్నాడు.

ఇప్పుడిక సమస్య భారత ప్రజలది కాదు. ఏ గెలుపు గుర్రం మీద పందెం కాయాలో తేల్చుకోవాల్సింది, భారత బడాబూర్జువా వర్గమే. ఆ సంగతి వీరిరువురికీ బాగా తెలుసు. కనుకనే భారత బడా బూర్జువావర్గం మన్ననలు పొందేందుకు తమతమ రీతిలో ఇరువురూ ప్రయత్నాలు ప్రారంభించారు.

బాక్సైట్ గనుల తవ్వకాలకు ఛిద్రమౌతున్న బ్రతుకుల నియమగిరి ఆదివాసులతో మీ తరఫున పార్లమెంటులో పోరాడే సైనికుడినని రాహుల్‌గాంధీ ప్రకటించుకుంటాడుగానీ పార్లమెంటులో నిర్బంధ భూసేకరణ గురించి పన్నెత్తి మాట్లాడడు. ఆయన తల్లి అధినేతగా వున్న యుపిఏ ప్రభుత్వం భూసేకరణ చట్టంలో సవరణలుచేసి రైతాంగానికి రక్షణలు కల్పిస్తానంటూ ఐదేళ్లనుండీ వాగ్దానాలు చేస్తుంది తప్ప దానిని పార్లమెంటులో ప్రవేశపెట్టదు. తమ భూములను బలవంతంగా గుంజుకోవటాన్ని ప్రతిఘటిస్తున్న రైతాంగంమీద పాశవికంగా విరుచుకుపడుతున్నది.

ముస్లింల ఊచకోతతో భయోత్పాత వాతావరణం సృష్టించి నష్టపరిహారంకూడా చెల్లించకుండా రైతాంగాన్ని గెంటివేసి వేలాది ఎకరాలను స్వాధీనం చేసుకున్న నరేంద్ర మోడీ గుజరాత్‌దాటి బయటకు వచ్చినపుడు భూసేకరణ చట్టాన్ని రద్దుచెయ్యాలని గర్జిస్తాడు. బడాబూర్జువాల సమావేశాలకు వెళ్లినప్పుడు మా రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టండి, ఎంత భూమి కావాలంటే అంత యిస్తానంటూ నమ్మబలుకుతాడు.

విద్యాహక్కు, ఆహారహక్కు చట్టాలను తెస్తానని ఊరిస్తూ యుపిఏ ప్రభుత్వం కాలం గడుపుతున్నది. ఆహారధాన్యాల ధరలు ఆకాశాన్ని దాటి పెరిగిపోతున్నా, తన గోదాముల్లో ఆహారధాన్యాలు నిండిపోయినా, వాటిని ఎగుమతి చేసేందుకు వాణిజ్య వర్గాలకు పంచుతున్నదితప్ప ప్రజాపంపిణీకి కేటాయించిన కోటాను రాష్ట్రాలు తీసుకోకపోయినా పట్టనట్లే వుంటున్నది. గతంలో లాగే రూపాయికి కిలో బియ్యం పథకమంటూ ప్రచారం సాగిస్తున్నది. ప్రాథమిక విద్యనుండి ఉన్నత విద్యవరకూ ప్రైవేటీకరించి, బోధనాంశాల నిర్ణయాన్ని విదేశాలకప్పజెప్పి, శాస్త్రవిజ్ఞానం దేశ ప్రజల ప్రయోజనాలు ఈడేర్చని స్థితికల్పించి అక్షరాలు నేర్పడాన్నే విద్యాహక్కును నెరవేర్చడంగా ప్రచారం చేస్తున్నది. ఈ పథకాల ప్యాకింగులో చుట్టి కాబోయే ప్రధానిగా రాహుల్‌గాంధీని చిత్రిస్తున్నది.

కాగా హిందూ మతోన్మాద నినాదాలతో దూకుడుగా మోడీ ముందుకొస్తున్నాడు. వాస్తవానికి ఈ హిందూ మతోన్మాద నినాదమే బిజెపిని గతంలో ఢిల్లీ గద్దె నెక్కించింది. రామాలయ నిర్మాణం సాకుతో సాగించిన రథయాత్ర పొడవునా మతఘర్షణల చిచ్చురగిల్చింది అద్వానీ. అద్వానీని తీవ్రవాదిగా, వాజ్‌పాయిని మితవాదిగా చిత్రించి వాజ్‌పాయిని గద్దె నెక్కించాయి పాలకవర్గాలు. ఇప్పుడు అద్వానీని మితవాదిగా మోడీని అతివాదిగా చిత్రించే నాటకాన్ని మళ్లీ సాగిస్తున్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టిన నేరస్తులను గౌరవనీయ నాయకులుగా చూపించే వంచనిది.

ప్రజాకర్షక పథకాలైనా, మతోన్మాద కార్యక్రమమైనా ప్రజలను వంచించేందుకే వీరిరువురూ వినియోగిస్తున్నారు. ఈ వంచనను అధిగమించి ప్రజలు పోరాట మార్గాన్ని చేపడితే పాశవిక నిర్బంధకాండకు పూనుకోవటంలో ఇరువురూ ఏమాత్రం వెనుకాడరు.

అయితే బూర్జువా వర్గాన్ని తమవైపు ఆకర్షించుకోవటానికి మాత్రం, తమకందిన రాజ్యాధికారాన్ని వారి సేవలోనే వినియోగిస్తామని నిరూపించుకోవటానికి ఒకరిని మించి ఒకరు వారికి ప్రజాధనాన్ని

(తరువాయి 2వ పేజీలో)

# సిపిఐ(ఎం-ఎల్) సీనియర్ నాయకులు కామ్రేడ్ వి.హెచ్.మాస్టర్‌కి అరుణారుణ జోహార్లు

**కర్ణాటక** రాష్ట్రానికి చెందిన సిపిఐ(ఎం-ఎల్) వృద్ధనాయకులు కామ్రేడ్ మాస్టర్(95) 2013 జూన్ 15న అర్ధరాత్రి తీవ్రమైన గుండెపోటుతో రాయచూర్‌లోని ఆయన ఇంటిలో మృతిచెందారు. వయసుపైబడినా కూడా ఆయన చాలా ఆరోగ్యంగా చురుగ్గా ఉండేవారు. చనిపోయే రోజున కూడా, నిద్రపోయేంతదాకా కార్మికుల సమస్య గురించి, వారి ఉద్యమాన్ని గురించీ చర్చిస్తూనే వున్నారు. కమ్యూనిస్టు విప్లవోద్యమానికి, కార్మికవర్గ ఉద్యమానికి ఆయన హఠాన్మరణం తీవ్రమైన లోటు. కామ్రేడ్ వి.హెచ్. మాస్టర్‌కి మా విప్లవ నివాళులర్పిస్తున్నాము.

సిపిఐ ప్రారంభ దినాలలోనే కామ్రేడ్ మాస్టర్ అందులోజేరారు. ఆయన రాజకీయ జీవిత క్రమమంతటా పీడితుల, రైతుల, కార్మికుల ఉద్యమాలు నిర్మించటంలో చురుకైన కృషిసాగించారు. కమ్యూనిస్టు ఉద్యమంలోని పరిణామాలన్నింటికీ ఆయన ప్రత్యక్షసాక్షిగా వున్నారు. అంతిమంగా ఆయన విప్లవ కమ్యూనిస్టు ఉద్యమ స్రవంతినెంచుకొని కడదాకా అందులోనే కొనసాగారు. ఆయన తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో వివిధ రూపాల్లో నిర్బంధాలనెదుర్కొన్నారు; ఏడు సంవత్సరాల జైలు జీవితాన్ననుభవించారు. ధైర్యానికి, క్రమశిక్షణకు, నిరాడంబర జీవనానికి నమూనాగా నిలిచారు. ఆయన జీవితంలో అత్యధిక కాలాన్ని కార్మికులు, రైతులు, దళితులు, పేదలను నిర్మాణయుతం చేసేందుకు వెచ్చించారు. కర్ణాటక రాష్ట్ర కార్మికోద్యమంలో కామ్రేడ్ మాస్టర్ ఒక ప్రజాదరణగల నాయకుడు.

కామ్రేడ్ మాస్టర్ 'సిపిఐ(ఎమ్-ఎల్) సెంట్రల్ ఆర్గాన్ జనశక్తి'లో కేంద్రకమిటి సభ్యులుగా కొనసాగారు. సిపిఐ(ఎం-ఎల్), సిపిఐ (ఎం-ఎల్) సెంట్రల్ ఆర్గాన్ జనశక్తిల నడుమ ఐక్యతా చర్చలను ఆయన మనస్ఫూర్తిగా ఆహ్వానించారు. ఐక్యత ఫలప్రదం కావటానికి ఆయన తన తోడ్పాటునందించారు. ఐక్యతానంతరం, ఐక్యసంస్థ నాయకత్వాన్ని కలుసుకోని, వారిని అభినందించేందుకు ఆయన చాలా ఆతృతను, ఆసక్తిని కనబరిచారు.

కమ్యూనిస్టు విప్లవోద్యమం యొక్క, పార్టీ యొక్క ఉజ్వల భవిష్యత్తు పట్ల ఆయన తన ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కర్ణాటక రాష్ట్రంలో పార్టీ నిర్మాణానికి గల అవకాశాలపై ఆయన తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కార్మికులు, దళిత ప్రజానీకం ఎర్రజెండాలు చేబూని దారిపొడవునా నినాదాలతో 16-6-2013 సాయంత్రం కామ్రేడ్ మాస్టర్ మృతదేహాన్ని స్మశానం వరకూ ఊరేగింపుగా తీసుకెళ్ళారు. దారిపొడవునా ప్రజలు కా॥మాస్టర్ పట్ల తమ గౌరవాభిమానాలను వ్యక్తం చేశారు. కా॥మాస్టర్‌కి నివాళులర్పిస్తూ స్మశానవాటిక వద్దకు వచ్చినవారంతా రెండునిముషాలు మౌనం పాటించారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీల నాయకులు కామ్రేడ్ మాస్టర్‌కి జోహార్లర్పిస్తూ మాట్లాడారు. మన ప్రియతమ నాయకుడు కా॥ వి.హెచ్. మాస్టర్ అసంపూర్తిగా వదలివెళ్ళిన కర్తవ్యాల కొనసాగింపుకై ప్రతినబూనాలని పిలుపునిచ్చారు.

## రాహుల్‌గాంధీ... (మొదటి పేజీ తరువాయి)

కట్టబెడుతున్నారు. యుపిఏ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఐదు బడ్జెట్టులలోనూ ఏడాదికి ఐదులక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలను బడాబూర్జువా వర్గానికి అందించింది. నానో కార్ల ఫ్యాక్టరీని గుజరాత్‌లో పెట్టించేందుకు టాటాలకు మోడీ ప్రభుత్వం 31వేల కోట్ల రూ॥లు భూమి, నీరు, విద్యుత్తు, పన్నురాయితీల రూపంలో సబ్సిడీలు యిచ్చింది. రాహుల్ గాంధీ, నరేంద్రమోడీలు బడాబూర్జువాల సంఘాల వార్షిక సమావేశాలకు వెళ్లి వారికోసమే పనిచేస్తున్నామని చెప్పుకొనేందుకు పోటీపడుతున్నారు. బడాబూర్జువాలను శతకోటీశ్వరులను చేసింది తమ విధానాలేనని చాటి చెప్పేందుకు ఎక్కడలేని తెగువ చూపుతున్నారు.

విచిత్రమేమిటంటే ఏ విధానాలైతే విజయవంత మయ్యాయని వారంటున్నారో ఆ విధానాలు దోపిడీ వర్గాల సంపదను పెంచాయి; భారత ప్రజల దారిద్ర్యాన్ని పెంచాయి. విదేశాలకు చెల్లింపులలో లోటును పూడ్చుకుని భారత్‌ను ప్రపంచ ఆర్థికశక్తిగా నిలుపుతామంటూ ప్రారంభించిన నూతన ఆర్థిక విధానాల పాతికేళ్ల అమలు తర్వాత దేశ ఆర్థిక పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నదన్న చందంగా వుంది. విదేశాలనుండి వచ్చే డబ్బుకంటే విదేశాలకు వెళుతున్న డబ్బే ఎక్కువగా వుంది. దీనిని కరెంటు అకౌంటు లోటు అంటున్నారు. ఉత్పాదక పరిశ్రమలు కునారిల్లుతున్నాయి. వ్యవసాయంలో వృద్ధిరేటు 2 శాతం లోపున స్థంభించి పోయింది. డాలరుతో రూపాయి మారకం 60 రూ॥లకు పడిపోయింది. ఇవన్నీ నూతన ఆర్థిక విధానాల పేరిట అమలుజరిపిన సంస్కరణ ఫలితమే. అయినా మరిన్ని సంస్కరణలు చేయాలన్న బడాబూర్జువాల డిమాండుకు యుపిఏ, ఎన్‌డిఏలు వత్తాసు పలుకుతున్నాయి. అధికారంలో వుంది గనుక సంస్కరణల పేరిట విదేశీ పెట్టుబడి ముందు మోకాలి దండవేసి రమ్మని ఆహ్వానిస్తున్నది. దానికి పూర్తి స్వేచ్ఛనిస్తానని హామీ యిస్తున్నది. మరిన్ని సంస్కరణలను అమలుచేయటంలో కాంగ్రెసు ప్రభుత్వం తడబడుతున్నదనీ తాను ఏమాత్రం జంకులేకుండా అమలు జరపగలననటానికి గుజరాతే సాక్ష్యమని బిజెపి చెప్పుకుంటున్నది.

తమ విధానాలు విఫలమయ్యాయన్న వాస్తవాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రజలపై నిందమోపుతున్నాయి. భారత సంస్కృతిలో బంగారం కొనుగోలు ఒక అంశం. నానాటికీ రూపాయి విలువ పడిపోవటంతో మధ్య తరగతులు బంగారం కొనటం పెరిగింది. విదేశాలనుండి బంగారం దిగుమతులు పెరిగాయి. ఇదే కరెంటు అకౌంటు లోటుకు మూలకారణంగా చూపిస్తూ పాలకవర్గాలు బంగారం కొనుగోళ్లు తగ్గించుకొమ్మని ప్రజలకు ఉచిత సలహాలిస్తున్నారు. వాస్తవమేమిటంటే ధనాఢ్య వర్గాలు తమ విలాసాల కొరకు కొనుగోలు చేస్తున్న ప్లాస్మా టీవీలు, ఎలక్ట్రానిక్ ఉపకరణలు, విలాసవంత కార్ల దిగుమతులు బంగారం దిగుమతులను మించి ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. దీన్నెలాగు ఆపమని అడగలేని పాలకులు బంగారంపై నెపంపెట్టి, విదేశీ పెట్టుబడులను ఆహ్వానించటంతప్ప మరో దారిలేదంటూ సామ్రాజ్యవాదులకు దాసోహం చేస్తున్నారు.

భావి భారత ప్రధాని ఎవరో తేల్చాల్సింది బడా బూర్జువాలే. ఒకవైపున అధికారమార్పిడి నాటినుండీ నమ్మకంగా తమ దోపిడీ ప్రయోజనాలను కాపాడుతున్న కాంగ్రెసు, సంక్షోభంతో ప్రజలలో పెరుగుతున్న అశాంతిని చల్లార్చే ప్రజాకర్షక పథకాలతో ముందుకొస్తున్న కాంగ్రెసు. మరోవైపున బడాబూర్జువాల కోర్కెలను సూటిగా సమర్థిస్తూ, తన మతోన్మాద ఎజెండాతో ప్రజలను అణచి వేసి బడాబూర్జువాల ప్రయోజనాలను ఈడేర్చగలనని చెప్పుకుంటున్న బిజెపి. ఇక ఏ గెలుపు గుర్రంపై పందెం కట్టాలో తేల్చుకొనేది కూడా బూర్జువా వర్గమే.

ఈ ప్రక్రియలో ప్రజలకే పాత్ర లేకుండా చేశారు. నిజమే ఓట్లు వేసేది ప్రజలే. కానీ ప్రజలు ఎవరికి ఓటు వెయ్యాలో నిర్ణయించేది బడాబూర్జువాలే. పందెం గుర్రాలను గెలుపువైపు పరుగెత్తించేది వీరందించే ధనపు సంచులే. వీరి ఆధీనంలో పత్రికలు, టీవీలు వంటి ప్రచార సాధనాలే. వీరి ధనము, ప్రచార మద్దతూ లేకుండా పోటీలో నిలిచిన అభ్యర్థి పేరు కూడా ఓటర్లకు తెలియదు. రాహుల్‌గాంధీ, నరేంద్రమోడీలలో తాము కోరుకున్న వారికి ప్రజలు ఓట్లు వేసేవిధంగా ప్రభావితం చేసేదీ బడాబూర్జువాలే. గ్రామీణ జీవనంపై ఉడుంపట్టు గలిగిన భూస్వామ్య వర్గాలే.

ప్రజలకు సంబంధించినంతవరకూ భారత భావిప్రధానులుగా చెప్పుకుంటున్న వీరిద్దరి మధ్య బడాబూర్జువాల, బడాభూస్వాముల ప్రయోజనాలు రక్షించటంలో ఎలాంటి తేడా లేదు. కుల, మత, ప్రాంతీయ, జాతీయ విద్వేషాలతో ప్రజలను చీల్చివేసే పద్ధతులు వాడాలన్న దానిలోనూ వారిమధ్య తేడా లేదు. ప్రజలను సహాయంకోసం తమవైపు నిరంతరం ఎదురుచూసే బిచ్చగాళ్లుగా వుంచే ప్రజాకర్షక పథకాలు వాడాలన్న దానిలోనూ వారిమధ్య తేడాలేదు. సమస్యల పరిష్కారంకోసం పోరాట మార్గాన్నెంచు కోకుండా ప్రజల అశాంతిని అణచివేయటానికి పాశవిక నిర్బంధకాండను సాగించటంలోనూ వారిద్దరి మధ్య తేడా లేదు.

తేడా అల్లా ముసుగుకప్పిన నాజూకైన, ఏమార్చే విధంగా ఈ పద్ధతులను కాంగ్రెసు వాడుతుండగా, నగ్నమైన, మొరటైన, విద్వేషాలు రగిల్చేవిధంగా ఈ పద్ధతులను బిజెపి వాడుతున్నది. వీరిలో దోపిడీ పాలకవర్గాలెవరినెంచుకుంటాయో చూద్దాం.

మొదటికొస్తే ప్రజలెదుర్కొంటున్న సమస్యలను విశ్లేషించి, వాటికి కారణాలను, పరిష్కారాలనూ చూపి, ప్రజలను చైతన్యపరిచి, వారి కార్యాచరణతో ప్రజలకు నాయకత్వం వహించి నడిపించే వారే ప్రజానాయకులవుతారు. కాగా ఈనాడు నాయకత్వ పదవికి పోటీపడుతున్న వారెవరు ఇలాంటి ప్రజానాయకులు కారు. దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాలకు సేవ చేయటానికి వారి ప్రతినిధులుగా ఎంపిక కావటానికి పోటీ పడుతున్నారు. ప్రజల, దేశప్రయోజనాల రక్షణ వీరి లక్ష్యం కాదు.

ఇప్పుడిక తేల్చుకోవాల్సింది ప్రజలే. అశేష ప్రజానీక జీవనంలో వెలుగులు నింపే నాయకత్వాన్ని ముందుకు తెచ్చేందుకు వారు పూనుకోవాలి. H

## దోపిడీ పాలకుల... (మొదటి పేజీ తరువాయి)

సగం భూమిపొరలు పీల్చు కుంటాయి. సగం మాత్రమే నదుల్లోకి ప్రవహిస్తుంది. దీన్ని గమనిస్తే వర్షపునీటిలో సగం భూమిపొరలు, తమలో దాచుకొనేవి. కనుక, వరద ప్రవాహం నియంత్రిచబడిన ఫలితంగా-నష్టం తక్కువ స్థాయిలో ఉండేది.

సామ్రాజ్యవాదుల, బడాపెట్టుబడిదారుల దోపిడీ ప్రయోజనాలను కాపాడుతున్న భారతపాలకులు అన్ని వనరులతోపాటు, అడవీ ప్రాంతాలను కూడా కట్ట బెడుతున్నారు. దీని ఫలితంగా విచ్చలవిడిగా అటవీ ప్రాంతాలు నాశనమౌతున్నాయి. అందులో భాగంగా ఉత్తరాఖండ్ అడవులు నరికివేతకు గురయ్యాయి. దీనివలన చెట్లు కనుమరుగై, వాటి ఆకులు మట్టిలో కలిసే ప్రక్రియ ఆగిపోయి, భూమి గట్టితనం దెబ్బతింది. దాని పర్యవసానంగా భూమి వర్షపునీటి కోతకు గురై, నదుల్లోకి మట్టి చేరటం జరుగుతూ ఉంది. వర్షపునీరు నిల్వచేసే సామర్థ్యం కూడా భూమికి తగ్గింది. నదుల్లో మట్టికలవటం వలన దానిలో మేటవేసి నీరుపైకి ఎగసి వచ్చింది. ఈ స్థితిలో ఉన్న నదులు, భారీవర్షాలకు వచ్చే నీటిని నిల్వచేసే సామర్థ్యం తగ్గిన ఫలితంగా నీరు ఉప్పొంగి వరద ఉధృతికి దారితీస్తున్నది. నేడు ఉత్తరాఖండ్‌లో వరద ఉధృతికి, అపార ప్రాణ, ఆస్థినష్టానికి ఇదే ప్రధాన కారణం.

ఈ విపర్యాన్ని స్థానిక ప్రజలు గుర్తించారు. చెట్లను కాపాడాలంటూ, చెట్లను నరకకుండా వాటిని కావిలించుకుని మహిళలు సాగించిన చిప్కో ఉద్యమం దీనినే తెలుపుతుంది. ఉత్తరాఖండ్ రాష్ట్రం ఏర్పడినపుడు ప్రజలు పర్యావరణం రక్షించబడుతుందని ఆశించారు. వారి ఆశలపై నీరుజల్లే విధానాలనే రాష్ట్రప్రభుత్వం అనుసరించింది. తన వినాశనానికి ప్రకృతి ప్రతీకారం తీర్చుకుందా అన్పించేంతగా వరద బీభత్సానికి కారణమయ్యాయి.

భగీరథీ, అలకనంద, మందాకినీ నదులపై జలవిద్యుదుత్పాదనకు డ్యాముల నిర్మాణం వల్లనే వరద బీభత్సం వచ్చిందని కొందరు పర్యావరణవాదులు వాదిస్తున్నారు. తెహ్రీడ్యాము తప్ప భారీడ్యాముల నిర్మాణం జరగలేదు. మిగిలినవన్నీ డ్యాములుకాదు. అవి పెద్దయెత్తున నీటిని నిల్వవుంచవు. అవి చిన్న ఆనకట్టలు మాత్రమే. సాంకేతికంగా వీటిని 'నదినీరు పొంగిపోయే కట్టలు' (రన్ ఆఫ్ ది రివర్) అంటారు. దీని నుండి 2 నుండి 4 మెగావాట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతుంది. వీటి నిర్మాణం వల్ల పర్యావరణం దెబ్బతినదు.

వీటి నిర్మాణం సమయంలో తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తచర్యలన్నీ తెలుసు. వాటి అమలుకు కావలసిన చట్టాలూ వున్నాయి. ఈ చిన్నకట్టల నిర్మాణం ప్రభుత్వరంగంలో సాగేది. దీనిని ప్రైవేటీకరించారు. జలవిద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణల్లో ఎలాంటి అనుభవంలేకున్నా, అసలు నిర్మాణరంగ అనుభవంలేకున్నా అడిగినవారందరికీ వీటి నిర్మాణానికి అనుమతులిచ్చేశారు. ఇప్పటికి 40నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 40 నిర్మాణపు వివిధ దశల్లో వున్నాయి.

త్వరితంగా వీలయినంత ఎక్కువ లాభాలు పొందటమే లక్ష్యంగా వీరు చట్టాలు నిర్దేశించిన కర్తవ్యాలు వేటినీ పాటించలేదు. వీరికి రాజకీయనేతల మద్దతు కలగలసి పర్యావరణాన్ని నాశనం చేశారు. చెట్లు నరికివేశారు. తక్కువ ఖర్చే ధ్యేయంగా కొండలు తవ్వి రోడ్లువేశారు. కదిలించిన కొండలను తిరిగి పటిష్టపరిచే చర్యలు తీసుకోలేదు. నరికిన చెట్లస్థానంలో మళ్ళీ చెట్లు నాటలేదు. వీటిలోకొన్నింటిని ప్రభుత్వమే నిర్మించింది. అయినా కాంట్రాక్టర్ల లాభాల కోసం ఏ పర్యావరణ చట్టాన్నీ అమలుజరపలేదు.

ఫలితం భూసారకోత పెరిగి, నదీగర్భం ఎత్తు పెరిగింది. నీరుపీల్చుకునే నేల లేక పడ్డచినుకల్లా నదిలోకిచేరి వరదలా వెల్లువెత్తింది. పట్టు కోల్పోయిన బండరాళ్ళు దొర్లిపడ్డాయి. సగటు వర్షపాతానికి కొంచెం ఎక్కువైనా, వరద వెల్లువెత్తింది. అపార జన, ప్రాణ, ఆస్థినష్టాలకు దారితీసింది.

తెలిసి తెలిసి పర్యావరణ వినాశనానికి దారితీసే చట్టవిరుద్ధ లాభార్జనా చర్యలకు పాల్పడిన పాపాన్ని కప్పిపుచ్చుకునేందుకు రికార్డుస్థాయి వర్షపాతం, కనీవినీ ఎరగని వరదలూ అంటూ పాలకులు తమచేతుల కంటిన మట్టిని కడుగుకుంటున్నారు. కొందరు పర్యావరణవాదులు డ్యాముల నిర్మాణాన్ని కారణంగా చూపుతూ అసలు కారణాన్ని పట్టించుకోకుండా తమకు తెలియకుండానే పాలకులకు తోడ్పడుతున్నారు.

### బాధితులను పట్టించుకోని ప్రభుత్వం

రోజుల తరబడి జలదిగ్బంధంలో చిక్కుకున్న ప్రజలను, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన యాత్రికులను ఆదుకోవటంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనాయి. వరదలు వచ్చిన మూడురోజుల వరకు ప్రజలను రక్షించే ఎటువంటి చర్యలు ప్రభుత్వం చేపట్టలేదు. వారి రక్షణ గురించి ఆలోచించలేదు. అన్నం-మంచినీరు లేక హాహాకారాలు చేస్తున్న ప్రజలకు వాటిని అందించే చర్యలు చేపట్టలేదు. అదేమంటే బాధితుల వద్దకు వెళ్ళే అవకాశంలేదనే సమాధానంతో సరిపెట్టింది. స్థానిక ప్రజలు, వ్యాపారులు వెళ్లగలిగినప్పుడు, ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు వెళ్ళలేకపోయింది? బాధిత ప్రజలకు సేవ చేయాలని, వారి ప్రాణాలను కాపాడాలనే యోచనలేని పాలకులు కాబట్టే. అలాంటి యోచన ఉన్న పాలకులైతే ఏదో ఒక మార్గం ప్రజల వద్దకు వెళ్ళటానికి కన్పించేది.

వరదల జలదిగ్బంధంలో లక్షకుపైగా ప్రజలు చిక్కుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన యాత్రికులే ఇందులో ఎక్కువగా ఉన్నారు. ఇప్పటివరకు 70వేల మంది సురక్షిత ప్రాంతాలకు చేరినట్లు, ఇంకా 15వేల మంది దిగ్బంధంలోనే ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ నుండి వెళ్ళిన 2700మంది యాత్రికుల్లో 2000 మంది సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారని, ఇంకా 700మంది ఉన్నారని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రప్రజలను రక్షించి సురక్షిత ప్రాంతాలకు చేర్చే విషయంలో ప్రభుత్వం అనుసరించిన వైఖరిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత మాత్రమే రాష్ట్రప్రభుత్వం మంత్రుల బృందాన్ని పంపింది. రాష్ట్ర యాత్రికుల్లో మిగిలినవారిని సురక్షితప్రాంతాలకు చేర్చేందుకు ప్రభుత్వం తక్షణచర్యలు చేపట్టాలి. తాజాగా మరో మూడురోజులు భారీవర్షాలు కురుస్తాయని ప్రకటించటంతో దిగ్బంధంలో ఉన్నవారిని యుద్ధ ప్రాతిపదికపై చేర్చే చర్యలతోపాటు మరో ఉపద్రవంలో చిక్కుకోకుండా తీరప్రాంతంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. వారి రక్షణకు అన్ని చర్యలు చేపట్టాలి.

ఈ పనులు చేపట్టకపోగా శవరాజకీయాలకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు, టిడిపిలు పాల్పడ్డాయి. ఈ యాత్రికులను వారి స్వస్థలాలకు చేర్చామన్న కీర్తికొరకు వారు బాహాబాహీ ముష్టిఘాతాలకు, బూతుల పంచాంగాలకు దిగటం పాలకవర్గాల దిగజారుడు సంస్కృతినే ప్రతిబింబించింది.

### వరద నివారణ చర్యలు చేపట్టాలి

దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రతిసంవత్సరం సంభవిస్తున్న వరదలను నివారించటానికి, నదీ జలాలను, వర్షపునీరును - సాగునీరు-త్రాగునీరు అందించే విధంగా నదులపై రిజర్వాయర్లు, చిన్న, మధ్యతరహా నీటిప్రాజెక్టులు, అవసరమైన చోట భారీప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు నిర్మించాలి. నదుల అనుసంధానం సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. అప్పుడు మాత్రమే వరదలను నియంత్రించి వాటి నష్టాలను తగ్గించటం సాధ్యమౌతుంది; దుర్భిక్ష పరిస్థితులను, కరువును రూపుమాపగలుగుతాము. H

# టర్కీ వెల్లువెత్తిన ప్రజానిరసన మూలాలు

**టర్కీ** రాజధాని ఇస్తాంబుల్‌లో ప్రధాన వాణిజ్య కేంద్రం వద్దనున్న తాక్సిమ్‌గేజి పార్కు నగరంలో పచ్చపచ్చగా వుండే ప్రాంతం. ఈ పార్కును తొలగించి దాని స్థానంలో షాపింగ్‌మాల్ నిర్మాణానికి ప్రైవేటు శక్తులకిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

జూన్ నెల మొదటివారంలో పార్క్‌ను నేలమట్టం చేసేందుకు ప్రభుత్వం పూనుకుంది. దీనితో వేలాదిమంది ప్రజలు పార్క్‌కు చేరుకున్నారు. బుల్‌డోజర్లను అడ్డుకున్నారు.

టర్కీలో ఇటీవల మేడే ప్రదర్శనలు పెద్దయెత్తున సాగుతున్నాయి. వాటికి ఈ పార్క్ కేంద్రంగా వుంది. ఈ ఏడాది ప్రభుత్వం పార్కు నుండి 20మైళ్ళలోపు ఎలాంటి ప్రదర్శనలు జరపరాదని నిషేధాజ్ఞలు విధించింది. రవాణా వ్యవస్థను ఆపివేసింది. అయినా మేడే ప్రదర్శనకు పూనుకున్న ప్రజలపై లాఠీచార్జీ, నీటి ఫిరంగులు, టియర్‌గ్యాసుతో విరుచుకుపడింది.

మళ్ళీ ఈ వద్దతులనే తాక్సింపార్కు వద్ద నిరసనకారులపై ప్రయోగించింది. ప్రదర్శకులపై సాగిస్తున్న ఈ దాడితో ఆగ్రహించి మరింతగా ప్రజలు పార్కుకు చేరుకున్నారు. వారిసంఖ్య 10లక్షలని అంచనా. ప్రసార సాధనాలపై ప్రభుత్వం నిషేధంపెట్టినా ఇంటర్‌నెట్ ద్వారా తెలిసి అంకారా, ఇజ్మీర్ వంటి ఇతర నగరాలకు నిరసనలు వ్యాప్తి చెందాయి. పోలీసులకు ప్రజలకు మధ్య ఘర్షణలు సాగాయి. పార్క్ వద్ద అనేకమంది మృతి చెందారు. అన్ని నగరాలలోనూ కలిపి వందలాదిమంది గాయపడ్డారు. మరునాడు తెల్లవారే వరకూ ప్రజలు వీధులలోనే గడిపారు.

ప్రదర్శకుల్లో మహిళలు, యువత ప్రధానంగా వున్నారు. వారికి టర్కీలోని వివిధ కమ్యూనిస్టు పార్టీలు ప్రజాస్వామిక పార్టీలు, పర్యావరణవాదులూ, వైద్యుల, ఇంజనీర్ల సంఘాలు, ప్రభుత్వరంగ సంస్థల కార్మిక యూనియన్లు, మేధావులూ, కళాకారులు, లౌకికవాదులు మద్దతు తెలిపారు.

కాగా ప్రధాని ఎర్డొగాన్ ఇది ఇద్దరు ముగ్గురి పిచ్చివాళ్ళ అల్లరిగా పేర్కొన్నాడు. నిరసనలు రెండవరోజు కూడా సాగటంతో పార్లమెంటు సభాపతి సెమిల్ సెసిక్, ఇతర నాయకులూ, ప్రజల డిమాండు ప్రజాస్వామిక మైనదంటూ మాట్లాడటం మొదలుపెట్టారు. కాగా ప్రజలపై సాగిస్తున్న దాడులను మంత్రులు సమర్థించుకున్నారు.

పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల ప్రచారసాధనాలు దీనిని పర్యావరణ సమస్యపై ప్రజల ప్రతిస్పందనగా చిత్రించాయి. టర్కీలోని ప్రతిపక్షపార్టీలు కూడా (రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ - సిహెచ్‌పి, నేషనలిస్టు మూమెంట్ పార్టీ- ఎంహెచ్‌పి) దీనిని ప్రజాస్వామిక డిమాండుగానే చిత్రించాయి. ఇది వాస్తవమేనా? టర్కీ ప్రభుత్వమూ, పాలకవర్గాలూ అనుసరిస్తున్న విధానాలను పరిశీలిస్తే ఈ ప్రజానిరసన మూలాలూ, అసలు స్వభావమూ అర్థమౌతుంది.

టర్కీలోని ఏకెపి ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదానికి మధ్య ప్రాచ్యంలో నమ్మిన బంటుగా వుంది. అది నిర్దేశిస్తున్న నయా ఉదారవాద రాజకీయాలనూ, విధానాలనూ తూచాతప్పక పాటిస్తున్నది.

బహుళజాతి కంపెనీలకు ప్రభుత్వ ఆస్థులను ధారాదత్తం చేయటం; పెద్దఎత్తున ఉద్యోగులనూ, కార్మికులనూ పనినుండి తొలగించటం; పొరుగు సేవలలో కార్మిక శ్రమశక్తిదోపిడీ తీవ్రపరచటం, వేతనాల కుదింపు, ఉత్పాదకత పేరిట పనిభారం పెంపు, కార్మిక యూనియన్లను విచ్ఛిన్నం చేయటం, సామాజిక హక్కులను కాలరాయటం – తదితర విధానాల అమలుతో ప్రజలలో అశాంతి, వ్యతిరేకతా పెరుగుతున్నది.

టర్కీ – యూరప్, ఆసియా ఖండాలకు మధ్య నుండటంతో ఇరు ఖండాలకూ చెందిన వారూ, రెండు మతాలకూ చెందినవారుగా వున్న ప్రజలను విభజించే విధానాలను అనుసరించటమూ, ఏకెపి ప్రభుత్వం స్కూళ్ళలో నిర్బంధ మతవిద్యను ప్రవేశపెట్టడమూ, మత గ్రంథాలను బట్టీ విద్యా సిలబస్ మార్పులు చెయ్యటమూ, మత మంత్రిత్వశాఖ ఏర్పాటు, మత బోధకుల సంఖ్యను పెంచటమూ, వారికి జీతాలివ్వటమూ; ఏకెపి అనుకూల మతసెక్షన్లనే ఉన్నత నిరంకుశాధికారులగా నియమించటమూ ప్రజలతోపాటు మధ్యతరహా బూర్జువావర్గాన్ని అసహనానికి గురిచేసింది.

దీనితోపాటు మైనారిటీ జాతులపట్ల వివక్షత, ప్రత్యేకించి కుర్దు జాతీయులను టర్కీ "ప్రధాన స్రవంతి" అన్నదానిలో కలిపే బలవంతపు పద్ధతులు, దానికోసం అమలుజరుపుతున్న పాశవిక నిర్బంధకాండ ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంచుతున్నాయి.

ప్రజాజీవనం నానాటికీ దుర్భరమౌతున్నా, రాజకీయ అస్థిరత నెలకొన్న మధ్య ప్రాచ్యదేశాలలో పెట్టుబడి మదుపు పెట్టడానికి ఇచ్చగించని విదేశీ పెట్టుబడులకు అధిక వడ్డీలు యివ్వటం ద్వారా వాటిని దేశంలోకి ఆకర్షిస్తున్నది. ఈ పెట్టుబడులతో నిర్మాణ రంగాన్ని పెంచుతున్నది. దీనికి "పట్టణీకరణ విధానమ"ని పేరుపెట్టింది. దీనితో ప్రజలు ఉమ్మడిగా వాడుకునే స్థలాలను కబ్జాచేసి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి, అధికధరలకు అమ్ముతున్నది.

దీనితో పెరిగిన కార్లతో రోడ్ల వెడల్పు తదితరాలలో ఉమ్మడి స్థలాలు కనుమరుగవటం, చెట్లు లేకుండా పోవటం దారితీసింది. ఇది ప్రజల అసంతృప్తిని పెంచింది.

విదేశీ పెట్టుబడులతో సాగుతున్న ఈ నిర్మాణరంగ కార్యకలాపాలతో ఆర్థికవ్యవస్థ ఆరోగ్యంగా ఉన్నట్లు కన్పించింది. యూరోపియన్ యూనియన్‌లోని మిగిలిన దేశాలలో సంక్షోభాలు తలెత్తినా, టర్కీ ఆర్థిక వ్యవస్థ నిలకడగా వున్నట్లు కనిపించింది. అయితే 2009లో ప్రారంభమైన ఈ సంక్షోభం 2012నాటికి కూడా కొనసాగుతుండటంతో టర్కీలోకి విదేశీ పెట్టుబడుల రాక తగ్గింది. దీనితో ప్రభుత్వం ఆస్తులను అమ్మిన నిధులతో ఆర్థికవ్యవస్థని నిలబెట్టడానికి పూనుకుంది. తాక్సిమ్‌పార్క్ అమ్మివేత దీనిలో భాగమే.

అమెరికా ఆజ్ఞలమేరకు సిరియా పట్ల టర్కీ పాటించిన విధానం మరిన్ని ఆర్థిక, రాజకీయ చిక్కులు తెచ్చిపెట్టింది. సిరియాతో సరిహద్దుల వద్ద ఇస్లామిక్ గ్రూపులకు ఆర్థికంగా మద్దతునివ్వటం మతఛాందస శక్తులను పెంచుతున్నది. సరిహద్దు ప్రాంత ఆర్థిక వ్యవస్థ వాణిజ్యం దెబ్బతింది. ఇది ప్రజలలో ప్రభుత్వ విధానంపట్ల అసంతృప్తిని పెంచింది.

ఈ నేపధ్యంలోనే ఏకెపి ప్రభుత్వం తాక్సిమ్‌పార్క్ తొలగింపును ప్రకటించింది. దీనితో ప్రజలు ఒక్కసారిగా తిరగబడ్డారు. వివిధ సెక్షన్ల ప్రజలు మద్దతుగా నిలిచారు. నిర్బంధకాండ వారిని అణచివేయలేకపోయింది. దానితో ప్రభుత్వం ప్రస్తుతానికి వెనక్కితగ్గి తన ప్రతిపాదనను ఉపసంహరించినట్లు ప్రకటించింది.

ప్రజాస్వామిక డిమాండుతో టర్కీ ప్రజలు సాగించిన ఆందోళనకు "జనశక్తి" మద్దతు తెలుపుతున్నది. ఇది ప్రజాస్వామిక డిమాండుగా వున్నప్పటికీ అది ముందుకు రావటానికి కారణాలు దానికున్న విప్లవాత్మకతను తెలుపుతున్నాయి. దీనిని విప్లవోద్యమంగా మలచవలసిన కర్తవ్యం టర్కీ విప్లవకారుల ముందు వుంది. H

# గ్రీసు కార్మికులనూ, ఉద్యోగులను పని నుండి తొలగిస్తున్న పొదుపు చర్యలు

**సామ్రాజ్యవాద** ప్రపంచీకరణ విధానాలు రుద్దటంతో గ్రీసు ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. గ్రీసు ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింప చేస్తామంటూ యూరోపియన్ యూనియన్ ద్రవ్యసహాయం పేరిట పొదుపుచర్యలను రుద్దింది. దీనితో గ్రీసు ప్రభుత్వం కార్మికులను పని నుండి తొలగించటం ప్రారంభించింది (చూడండి జనశక్తి గత సంచికలు). దీనికి నిరసనగా గ్రీసు ప్రజలు అనేక పోరాటాలు సాగిస్తున్నారు.

సహాయం పేరిట యూరోపియన్ కమిషన్(ఇ.సి) అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్), యూరోపియన్ సెంట్రల్ బ్యాంకుల "త్రయం" గ్రీసు ప్రభుత్వ మనుసరించాల్సిన విధానాలన్నింటినీ నిర్దేశిస్తున్నది. ఈ త్రయం విధించిన షరతుల ప్రకారం 2015నాటికి 1,50,000 మందిని ఉద్యోగాల నుండి తొలగించాల్సి వుంది. 2013 జూన్ 10వ తేదీన పొదుపు చర్యల అమలును సమీక్షించేందుకు గ్రీసు వచ్చిన త్రయం ప్రతినిధి బృందం జూన్ నెలాఖరులోగా 4000 మందిని పని నుండి తొలగించమని ఆదేశించింది. అయినా వెళ్ళిపోకుండా గ్రీసులోనే వున్న ప్రతినిధి బృందం దీనినమలు చేయమని గ్రీసు ప్రధాని సమరాస్‌పై వత్తిడి చేసింది.

దీనితో ప్రభుత్వఆధ్వర్యంలోని హెల్లెనిక్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(ఇఆర్‌టి)ను మూసివేస్తున్నట్లు 11వతేదీన ప్రధాని ప్రకటించాడు. దీనితో 2700 మందిని ఉద్యోగాల నుండి తొలగించారు. కార్పొరేషన్ ముఖ్య కార్యాలయాన్ని వదలిపోవటానికి ఉద్యోగులకు ఐదునిముషాలు గడువు యిచ్చారు. పోలీసులు కార్పొరేషన్ నిర్వహించే అన్ని రేడియో, టి.వి. స్టేషన్లకు విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. ప్రసారాలు ఆగిపోయాయి.

అయితే ఉద్యోగులు ముఖ్యకార్యాలయాన్ని వదలి వెళ్ళేందుకు నిరాకరించారు. దానిని తమ స్వాధీనంలో వుంచుకున్నారు. ఈ వార్త తెలిసి వేలాదిమంది మద్దతు తెలుపుతూ ముఖ్య కార్యాలయం వద్దకు చేరారు. కార్పొరేషన్ మూసివేతకు ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత రావటంతోపాటు, దానిని ప్రతిఘటించే చర్యకు పూనుకోవటంతో గ్రీసు ప్రభుత్వం బెదిరిపోయింది.

దీనితో పాలకవర్గాలు కొత్త ఎత్తుగడవన్నాయి. గ్రీసులోని ఉన్నతపరిపాలనా న్యాయస్థానం(రాజ్యసమితి)తో జూన్11న కార్పొరేషన్ మూసివేత నిర్ణయాన్ని రద్దుపరిచే రూలింగును జూన్17న యిప్పించాయి. అయితే ఈ రూలింగు వివరాలు ఇలా వున్నాయి.

కార్పొరేషన్‌ను మూసివేసే అధికారం ప్రభుత్వానికి వుంది. కానీ కార్పొరేషన్ కార్యక్రమాల ప్రసారాన్ని ఆపటం చట్టవ్యతిరేక చర్య. కనుక వెంటనే కార్యక్రమాల ప్రసారాలను పునరుద్ధరించాలి. ప్రభుత్వం ఉద్యోగులను, కార్మికులను తొలగించి పునర్నిర్మాణ కార్యక్రమాన్ని అమలుచేసుకోవచ్చు.

దీనితో ప్రభుత్వం నెరిట్ అన్న కొత్తకంపెనీకి కార్పొరేషన్‌ను అప్పజెబుతాననీ, అది 1200 మంది సిబ్బందితో కార్పొరేషన్ ప్రసారాలను కొనసాగిస్తుందని ప్రకటించింది.

వామపక్షంగా చెప్పుకునే సిరీజా పార్టీ అసలు సమస్య నుండి ప్రజల దృష్టిమళ్ళించేందుకు పూనుకుని పరోక్షంగా ప్రభుత్వానికి సాయపడింది. బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ మూసివేతలో ఉద్యోగుల తొలగింపు చిన్న సమస్యఅట! ప్రజలకు సమతూక వార్తలందజేయక పోవటం ప్రజాస్వామ్యంపై వేటుఅట! సిరిజా నాయకుడు అలెక్సిస్ సిపారా "చిన్న చిన్న సమస్యలు వదలిపెట్టి, ప్రజాస్వామ్య పరిరక్షణకు పూనుకొమ్మని ప్రజాస్వామిక వాదులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను" అన్నాడు. మిగిలిన ప్రతిపక్షాలు కూడా "ప్రజాధనాన్ని సక్రమంగా వినియోగించాలి. ఉద్యోగులను తొలగించటానికి మాకభ్యంతరం లేదు. ప్రసారాలు కొనసాగించాలి" అంటూ ప్రచారాన్ని సాగించాయి.

ఆవిధంగా కార్పొరేషన్ మూసివేతను నిలిపి వేసినట్లు కలిసికట్టుగా నాటకమాడాయి. మూసివేతకు వ్యతిరేకంగా వచ్చిన ప్రజావెల్లువను నివారించగలిగాయి.

దీనికి వారికి మంచి కితాబులే దక్కాయి. జర్మనీ ఛాన్సెలర్ మెర్కెల్ గ్రీసు ప్రధానికి ఫోనుచేసి నిరసన రాజకీయ సంక్షోభానికి దారితీయకుండా నిలువ రించినందుకు అభినందనలు తెలిపింది. "సంస్కరణల అమలు దారిలోనే పయనం సాగించమ"ని కోరింది.

గ్రీసులోని ప్రభుత్వరంగ సంస్థల పనితీరు ఎంత నాసిరకంగా ఉందో తెలిపే ఉదాహరణ ఇఆర్‌టి అని న్యూయార్క్ టైమ్స్ వ్యాఖ్యానించింది.

ఇఆర్‌టిని మూసివేత నుండి "రక్షించా"మన్న మాట నీటిమూటే. ద్రవ్యసంస్థల "త్రయం" ప్రతినిధి బృందం అక్కడే వుంది. 18వ తేదీన గ్రీసు ఆర్థికమంత్రి వీరితో చర్చలు సాగించాడు. మొత్తం ఉద్యోగుల దశలవారీ తొలగింపు గురించి చర్చించారు. గ్రీసులో ఆరోగ్య సేవలందించే ప్రభుత్వ సంస్థ ఇఒపిపివై "త్రయం" నిర్దేశించిన లక్ష్యాల సాధనలో విఫలమైందనీ వీటిని ఈ ఏడాదిలోగా సాధించాలనీ "త్రయం" చెప్పింది. ఆ లక్ష్యాలు : ఆరోగ్యబీమాసంస్థను ప్రైవేటీకరించాలి. (అంటే జర్మనీ బీమా కంపెనీలకు అప్పగించాలి) అంతకు ముందుగా ఉద్యోగుల సంఖ్యను కుదించాలి.

కార్మికులను, ఉద్యోగులను పని నుండి తొలగించే పొదుపుచర్యలే ఇకముందు కూడా కొనసాగుతాయి. H

# బ్రెజిల్ ప్రజారవాణా వ్యవస్థను జాతీయం చేయాలని యువజనుల ఆందోళన

**2013** జూన్ నెలలో లక్షలాదిమంది బ్రెజిలియను ప్రజలు, ప్రధానంగా యువజనులు, బస్సు ఛార్జీలను తగ్గించాలనీ, విద్యార్థులకు ఉచిత పాసులివ్వాలనికోరుతూ వీధులలోకి వచ్చి ప్రదర్శనలు చేశారు. బ్రెజిల్ దేశంలో ప్రజారవాణా వ్యవస్థ అధ్వాన్నస్థితిలో వుండగా ఛార్జీలను మాత్రం ప్రతిఏడాదీ ద్రవ్యోల్బణానికంటే ఎక్కువగా పెంచి వేస్తున్నారు. ఫలితంగా 3.7కోట్ల బ్రెజిల్ సామాన్య పౌరులు ఛార్జీలను చెల్లించలేక నడిచి వెళ్ళాల్సి వస్తున్నది.

బస్సు రవాణాను బ్రెజిల్ ప్రభుత్వం ప్రైవేటీకరించింది. అన్ని నగరాలలోనూ సిటీబస్సులను కొద్దిమందిగా వున్న ధనిక కుటుంబాలు నడుపుతున్నాయి. పాలకులు లంచాలు మరిగి ప్రతిఏడూ ఛార్జీలను పెంచివేస్తున్నారు. ఇదికాక బస్సు యజమానులకు మున్సిపాలిటీలు, ప్రభుత్వాల నుండి సబ్సిడీలు అందుతున్నాయి. దీనితో బస్సు యజమానులు సూపరు లాభాలు గడిస్తున్నారు. దీనికి పరిష్కారం ప్రజారవాణా వ్యవస్థను జాతీయం చేయటమే. నిరసన ప్రదర్శన చేస్తున్న యువజనులు ఈ డిమాండును ముందుకు తెచ్చారు.

అయితే బ్రెజిల్ ప్రభుత్వం నిధులులేవని వాదించింది. ప్రదర్శకులపైకి పోలీసులను పంపి లాఠీచార్జీ, టియర్‌గ్యాసు, తుపాకీకాల్పులూ సాగించింది.

యువజనుల ఈ ఆందోళన వెనుక గత కొన్నేళ్ళుగా బ్రెజిల్ ప్రభుత్వ మనుసరిస్తున్న విధానాల దుష్పలితాలు గూడుకట్టుకుని వున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఏకీకృత ఆరోగ్య రక్షణ వ్యవస్థను బ్రెజిల్ పాలకులు తొలగించారు. దాని స్థానంలో ప్రవేశపెట్టిన ఆరోగ్య బీమా పథకాలు విదేశీ బీమా కంపెనీల వ్యాపారాన్ని పెంచాయిగానీ, 40శాతం మంది జనాభాకు ఆరోగ్యసేవలను అందుబాటులో లేకుండా చేశాయి. విద్యను ప్రైవేటీకరించి అమ్మకపు సరుకుగా మార్చారు. విదేశీ గుత్తకంపెనీలు రైతుల నుండీ, ఆదివాసీల నుండీ భూమిని గుంజుకుని, దానిలో సోయాచిక్కుడు పండించి ఎగుమతి చేస్తున్నాయి. ఫలితంగా ప్రజలకు ఆహారం అందుబాటులో లేకుండా పోయింది.

ప్రజోపయోగ చర్యలకు నిధులు లేవంటున్న ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి క్రీడాస్థలాలను ఆధునీకరించింది. బ్రెజిల్‌లో ప్రాచుర్యం పొందిన ఆట ఫుట్‌బాల్. ఫుట్‌బాల్ అంతర్జాతీయ సమాఖ్య (ఫీఫా) నిర్వహించే ప్రపంచకప్ పోటీల నిర్వహణకు ఈ ఖర్చుపెట్టింది. కాగా లాభాలు మాత్రం ఫీఫా పోగేసుకుంటుంది.

బ్రెజిల్ కార్మికుల వేతనాలు మిగిలిన లాటిన్ అమెరికా దేశాలన్నింటికంటే తక్కువగా వున్నాయి. కాగా గుత్త పెట్టుబడిదారుల లాభాలు మాత్రం పెరుగు తున్నాయి. బ్రెజిల్‌లో పెద్ద కోటీశ్వరుడు సిల్వియో సాంటొస్‌కు గతేడాది కంటే రెట్టింపు లాభాలు వచ్చాయి. సమాజ సమిష్టి వనరులన్నింటినీ పెట్టుబడిదారులపరం చేస్తున్నారు. సామాన్యులకు మాత్రం మురికివాడలే గతి. వర్షాకాలంలో సరైన గూడులేక పేదలు తమకున్న సర్వస్వాన్నీ కోల్పోతున్నారు. ప్రతిఏడూ వందలమంది ప్రాణాలు కోల్పోతున్నారు.

కాగా యూరపు దేశాలలో కార్ల ఫ్యాక్టరీలను మూసివేసి బ్రెజిల్ కార్మికుల శ్రమశక్తిని కారుచౌకగా కొల్లగొట్టేందుకు అక్కడ ఫ్యాక్టరీలు పెట్టిన కార్ల కంపెనీలకు సబ్సిడీలివ్వటానికి ప్రభుత్వం వద్ద నిధు లుంటున్నాయి. దివాళాతీస్తున్న బ్యాంకులకు ద్రవ్య సహాయం పేరిట ప్రజల గోళ్లూడగొట్టి వసూలుచేసిన పన్నుల నుండి ధనాన్ని చేకూరుస్తున్నారు.

ఈ దుర్భర పరిస్థితులే యువజనులను వీధుల్లోకి తీసుకువచ్చాయి.

గుత్తాధిపతుల ఆధిపత్యంలోని పత్రికలు మాత్రం యువజనుల ఆందోళనను అరాచకత్వం ప్రబలి పోవటంగా చిత్రిస్తూ దానిని అదుపుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. బ్రెజిల్ సైనిక ప్రభుత్వం యువజనులపై పాశవిక నిర్బంధాన్ని సాగిస్తున్నది.

దీనితో యువజనులు మరింత సంఘటిత పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఛార్జీలు తగ్గించాలన్న డిమాండు స్థానంలో ప్రజారవాణా వ్యవస్థను జాతీయం చేయాలి; సార్వజనీన ఉచిత విద్యా వైద్యసేవలు అందించాలన్న డిమాండ్లను ముందుకు తెచ్చారు.

బ్రెజిల్ యువజనుల ఆందోళనకు "జనశక్తి" మద్దతు తెలుపుతున్నది. H

# కనీస మద్దతుధరలు అడకత్తెరలో రైతాంగం

**ఆర్థిక** వ్యవహారాలపై కేంద్రమంత్రివర్గ కమిటీ వ్యవసాయ పంటల కనీసమద్దతు ధరలను 2013 జులై నుండి 2014 జూన్ వరకూ వర్తించేవిధంగా ప్రకటించింది. వరి ధాన్యం సామాన్యరకాల కనీస మద్దతుధరను క్వింటాలుకు రూ.1250 నుండి రూ.1310కి రూ॥60 పెంచింది. సన్నరకాలకు ధరను రూ.1345గా పేర్కొంది. 2012లో నాలుగురాష్ట్రాలలో అనావృష్టి వల్ల ఆహారధాన్యాల దిగుబడిలో 40లక్షల టన్నులు తగ్గిందని పేర్కొంటూ ఈ ఏడాది మంచి వర్షాలు పడినందున, కనీస మద్దతుధర పెంచినందున వరిపంటల విస్తీర్ణమూ, దిగుబడి పెరగటానికి తోడ్పడుతుందని చెప్పింది.

ఖరీఫ్ సీజనులో మిగిలిన ప్రధాన పంటల కనీస మద్దతు ధరలను కూడా కమిటీ ప్రకటించింది. పొట్టిపింజ ప్రత్తి కనీస మద్దతు ధరను రూ॥300 పెంచి రూ.3700లుగా ప్రకటించింది. పొడుగు పింజ ప్రత్తికి కూడా రూ.300పెంచి రూ.4000గా ప్రకటించింది.

ఇక పప్పుధాన్యాల కనీస మద్దతుధరను కూడా పెంచింది. మినుముల ధరను రూ.4300లుగా పెంచింది. ఇది రూ.450పెంపు. కాగా పెసల ధరను 100రూ॥లు పెంచి రూ.4500లుగా పేర్కొంది. కందుల ధరను పెంచకుండా రూ.4300గానే వుంచింది.

ఇక వంటనూనెలకు వస్తే ఒక్క సోయాబీనుకు తప్ప మిగిలిన పంటల కనీసమద్దతు ధరను పెంచలేదు. సోయాబీను ధరను రూ.2200 నుండి రూ.2500కు పెంచింది.

కేంద్ర వ్యవసాయశాఖ ఖరీఫ్ పంటలకు ప్రతిపాదించిన కనీస మద్దతుధరలనే కమిటీ ఆమోదించినట్లు ప్రకటించింది. వ్యవసాయఖర్చుల, ధరల కమీషన్ సూచనలను ప్రక్కన పెట్టింది.

వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరలను హేతుబద్ధంగా నిర్ణయించేందుకు సూచనలు చేయమని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ధరల కమీషన్‌ను(సిఏసిపి) కోరింది. కమీషన్ విస్తృతంగా పరిశీలన జరిపి కనీస మద్దతుధరల నిర్ణయం, రైతులు ఖర్చులను తిరిగిపొంది కొంత లాభం వచ్చేవిధంగా పద్ధతులను సూచించింది. దాని సూచనలను పాటిస్తే వరి ధాన్యం కనీస మద్దతుధర రూ.2500 యివ్వాలి. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ రూ.2340 వీరికి యివ్వాలని సూచించింది. చెరకు ధర రూ. 2400 దాటుతుంది. సిఏసిపి సూచనలను ప్రక్కనపెట్టి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ ధరలను ప్రతిపాదించగా కాబినెట్ కమిటీ ఆమోదించింది. కమీషన్ సూచనలతో పోలిస్తే కమిటీ పెంచిన ధరలు నామమాత్రమేనని అర్థమౌతుంది. రైతాంగానికి దక్కాల్సిన ఆదాయాన్ని పిండుకొని పారిశ్రామిక రంగానికి తరలించే విధానాన్ని కేంద్రప్రభుత్వం పాటిస్తున్నదని స్పష్టమౌతున్నది.

వాస్తవానికి ప్రభుత్వరంగ కొనుగోలు సంస్థలను రంగం నుండి తప్పించి, రైతాంగాన్ని ప్రైవేటు వ్యాపారుల కప్పజెప్పింది. దీనితో కనీస మద్దతు ధరకాస్తా గరిష్ఠ మార్కెట్టు ధరగా మారిందని గత దశాబ్దకాలపు కఠిన అనుభవం తెలుపుతున్నది.

ఇది చాలదన్నట్లుగా రైతాంగాన్ని అడకత్తెరలో పోకచెక్కలా నలిపే మరో నిర్ణయాన్ని కేబినెట్ కమిటీ ఇదే సమావేశంలో తీసుకుంది. సహజవాయువు ధరను ఒక మిలియన్ బ్రిటీషు థర్మలు యూనిటుకు 4.2డాలర్ల నుండి 8.4 డాలర్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

సహజవాయువు ధరపై గత ఆరునెలలుగా సాగుతున్న వివాదాన్ని గురించి, దీని పరిష్కారానికి ప్రభుత్వం చేస్తున్న నిర్ణయాల గురించి, అవి రిలయన్సు కంపెనీ అంబానీకి లక్షలకోట్లు లాభాలను కట్టబెట్టడం గురించి గత "జనశక్తి" సంచికలో వివరించాము.

పెట్రోలియం మంత్రి వీరప్పమెయిలీ ప్రతిపాదనలను ప్రక్కనబెట్టి, రంగరాజన్ కమిటీ సూచనలను కేబినెట్ కమిటీ ఆమోదించింది. అమెరికా, గల్ఫ్, లండను, జపాన్‌లలో సహజవాయువు మార్కెట్టు ధరల సగటును లెక్కించే సూత్రాన్ని రంగరాజన్ కమిటీ ప్రతిపాదించింది. దీని ప్రకారం సహజవాయువు ధర రెట్టింపై 8.4డాలర్లు అవుతుంది. ధర 2014 ఏప్రిలు 1నుండి అమలులోకి వస్తుంది. ప్రతి మూడు నెలలకొకసారి అంతర్జాతీయ ధరలను బట్టి దీనిని సవరిస్తారు. ఈ ధర ఒక్క రిలయన్సు కంపెనీకి కాకుండా, ప్రభుత్వరంగ ఓఎన్‌జిసి, ఆయిల్ ఇండియాలకు కూడా వర్తిస్తుంది. ఇవి మూడు కలిసి దేశంలో 80శాతం సహజవాయువునుత్పత్తి చేస్తున్నాయి. ఈ నిర్ణయం రైతాంగంపై ఎలా పడుతుందో చూద్దాం.

కేబినేట్ కమిటీ నిర్ణయం ప్రకారం సహజవాయువు ధర 8.4డాలర్లు అవుతుంది. ప్రస్తుతం 4.2డాలర్ల ధరతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్తు ధర యూనిటుకు 4.2 రూ॥లుగా వుంది. దీనిని పెంచటంతో ఈ విద్యుత్తు ధర యూనిటుకు సహజవాయువు రవాణా కూడా కలుపుకుంటే 9రూ॥లు అవుతుంది. కోట్లాది గొట్టపుబావులు కరెంటుతోనే నడుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాల్లోనే రైతాంగానికి ఉచిత కరెంటు అందజేస్తున్నారు. ప్రస్తుతధరల ప్రకారం డీజిలుతో విద్యుతుత్పత్తి చేసినా లేక డీజిలు ఇంజనులతో నీరుతోడినా 9 రూ॥లు ఖర్చు అవుతుంది. అంటే రైతాంగం సాగునీటి ఖర్చులు పెరుగుతాయి. గ్యాసు యూనిటుకు ఒక డాలరు పెరిగితే, విద్యుత్తు కంపెనీలకు రూ॥10,040కోట్లు అదనంగా ఖర్చు అవుతుంది. అదే 4.2 డాలర్లు పెరిగితే రూ.42,168కోట్లు ఖర్చు అవుతుంది. విద్యుత్తు కంపెనీలు ఈ ఖర్చునంతా వినియోగదారులపైనే మోపుతాయి గనుక ఈ భారమంతా వారేమోయాలి. దీనిలో 10శాతం రైతాంగంపై పడుతుందనుకున్నా వారిపైపడే భారం 4వేలకోట్ల రూ॥లపైనే.

ఇక సహజవాయువు నుండి యూరియా తదితర ఎరువులు తయారవుతాయి. రసాయనిక ఎరువుల పరిశ్రమ లోతుపాతులు తెలిసిన నిపుణుల అంచనా ప్రకారం (బిజినెస్ స్టాండర్డు 27-6-2013) సహజవాయువు ధర ఒకడాలరు పెరిగితే, దాని నుండి తయారయ్యే యూరియా ధరను ప్రభుత్వం పెంచకపోతే, ప్రభుత్వం రూ.3155కోట్ల సబ్సిడీని అదనంగా భరించాల్సి వస్తుంది. అంటే 8.42 డాలర్లకు ధరను పెంచితే ప్రభుత్వం భరించాల్సిన సబ్సిడీ రూ.13,231కోట్లు. వ్యవసాయ సబ్సిడీలు మోయలేని భారమయ్యాయంటున్న ప్రభుత్వం ఈ భారాన్ని రైతాంగంపైనే మోపుతుంది.

ఇదంతా డాలరు-రూపాయి మారకం విలువ 50రూ॥లుగా వున్నప్పటి ధరల అంచనాలు. ఇటీవల అది 60రూ॥లు పడిపోయినా గత ఏడాదంతా సగటున 55రూ॥లుగా వుంది. ఆలెక్కన ధరలు మరో 10శాతం పెరుగుతాయి.

సహజవాయువు ధరను అంతర్జాతీయ ధరలను బట్టి ప్రతి మూడు నెలలకూ సవరిస్తారు. ఇది ఇప్పటి ధరలను బట్టి 2014 ఏప్రిల్ నాటికి నిర్ణయించిన ధర. కాగా గల్ఫ్‌దేశం కతార్ సహజ వాయువునెక్కువ అమ్ముతుంది. ధరను ప్రభుత్వం నిర్ణయిస్తున్నది. 2014 జనవరి నుండి ధరల నిర్ణయ విధానాన్ని మార్చింది. సహజవాయువు ధరలను ముడిచమురు ధరలను బట్టి పెంచుతుంది. దాని ప్రకారం గ్యాసుధర 2015 నాటికి 10డాలర్లకుపైగా పెరుగుతుంది (ది హిందూ 28-6-2013). విద్యుత్తు, యూరియా ధరలు పెరిగిపోతూనే ఉంటాయన్నది స్పష్టం.

ఒక వైపున రైతాంగం పెట్టిన సాగుఖర్చులు కూడా రానివిధంగా పంటల ధరలను నిర్ణయిస్తూ, ప్రభుత్వ కొనుగోలు సంస్థలను రైతాంగం నుండి కొనుగోలు చేయకుండా తప్పించి, కనీస మద్దతుధరను గరిష్ఠ మార్కెటు ధరగాచేసి రైతాంగాని నిలువుదోపిడీ చేస్తున్నది. దిగుమతి చేసుకున్న బొగ్గు వాడుతున్న విద్యుత్తు ప్లాంటులకు విద్యుత్తు ధరను పెంచుకునేందుకు కేంద్రం అనుమతించింది. బొగ్గు దిగుమతి ధరతో సమాన ధర తనకూ యివ్వాలని కోల్ ఇండియా అడుగుతున్నది. త్వరలోనే ఈ నిర్ణయం కూడా తీసుకుంటారు. ఏపిఇఆర్‌సి ఇంధన సర్దుబాటు సర్‌ఛార్జీని రద్దుచేసింది. విద్యుత్తు ఛార్జీలలో దేనికెంతఅయిందోనన్నది ఇప్పుడు తెలుస్తున్నది. రేపటి నుండి గంపగుత్తగా ఛార్జీల పెంపుదల వుంటుంది. దీనిని ప్రజానుకూల చర్యగా చెప్పుకుంటున్నారు గానీ ఆచరణలో ప్రజలపై విచక్షణారహిత భారాలను మోపేందుకు వాడతారు.

మరోవైపున సహజవాయువు, బొగ్గు, డీజిలు, నాఫ్తా ధరలను పెంచి రైతాంగానికి సాగుకు అవసరమైన ఎరువుల ధరలూ సాగునీటికి అవసరమైన విద్యుత్తు, డీజిలు ధరలూ పెంచివేసి రైతాంగపు ఖర్చులను పెంచివేస్తున్నది. పెరిగిన ఖర్చులకు తగినట్లు రుణపరపతి పెంచకపోగా తగ్గిస్తున్నది. పర్యవసానంగా రైతాంగాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నది. అయినకాడికి పంటను తెగనమ్ముకునే దుస్థితి కల్పిస్తున్నది.

కత్తెరలోని రెండు అంచుల మధ్య రైతాంగాన్ని కత్తిరించివేస్తున్న ప్రభుత్వ విధానాలను "జనశక్తి" తీవ్రంగా ఖండిస్తున్నది. పంటలకు న్యాయమైన ధరలకోసం, సాగు అవసరాల ధరల తగ్గింపు కోసం, రుణ పరపతి సౌకర్యం పెంపుదల కోసం సంఘటిత పోరాటాలకు పూనుకొమ్మని పిలుపునిస్తున్నది. H

# జన్యుమార్పిడి పంటల ప్రవాహానికి గేట్లు బార్లా తెరిచేందుకు భారత పాలకుల తహతహ

**జన్యుమార్పిడి** విత్తనాల ద్వారా చీడపీడల దాడులను అరికట్టవచ్చని; వ్యవసాయ దిగుబడులను అత్యధికంగా పెంచటానికి అదే పరిష్కారమార్గమని పాలకులు గత దశాబ్దకాలంగా ఊదరగొడ్తూనే వున్నారు. తదనుగుణంగా మొదటగా బాసిల్లస్ తురెన్జిస్(బిటి)అనే జన్యుకణాన్ని ప్రవేశపెట్టిన పత్తివిత్తనాలను మోన్‌సాంటో వంటి బహుళజాతి వ్యవసాయ వాణిజ్య కంపెనీల ద్వారా బహుళ వినియోగంలోకి తెచ్చారు. తీరా చూస్తే, పాలకులు, దళారీ జీవశాస్త్ర నిపుణులు పేర్కొన్న విధంగా అబ్బురపరిచే ఫలితాలేమీ లేకపోగా, తద్విరుద్ధంగా అనేక దుష్పరిణామాలను రైతాంగం, ప్రజానీకం ఎదుర్కొంటున్నారు. బిటి పంటలపై క్రిమిసంహారకాల వాడకం తగ్గకపోగా, గత దశాబ్దకాలంలో మరింతగా పెరిగింది. ఆ పురుగుమందులను కూడా బహుళజాతి కంపెనీలే ఉత్పత్తిజేసి, అమ్మకాలు సాగించుకొని లాభాలు గడిస్తున్నాయి. పైగా, దిగుబడి కూడా ఆశించిన విధంగా లేకపోవటంతో పాటు బిటి పంటల ఫలితంగా పర్యావరణం, పశువులు, పరిసరాల్లో మనుషులు, జీవజాలం తీవ్ర దుష్ప్రభావాలకు గురయ్యాయి. అయినా బిటి విత్తనాలకు అనుకూలంగా సామ్రాజ్యవాద వ్యవసాయ వాణిజ్య కంపెనీల విస్తృత ప్రచారము, అందుకు ప్రభుత్వ ప్రోత్సహంలో మార్పులేకపోగా, వంగపంటలో బిటి ప్రవేశపెటేందుకు, వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు మరలా 2011లో తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే ప్రజలకు అప్పటికే ఎదురైన దుష్ప్రభావాల నేపథ్యం నుండి, బిటి వంగకు దేశవ్యాపితంగా విస్తృత నిరసన వ్యక్తమైంది. బిటివంగపై మారిటోరియం విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోక తప్పలేదు.

భారత వ్యవసాయం పరిశోధనామండలి, జెనెటికల్ ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటీ వంటి సంస్థల ద్వారా ప్రభుత్వం జన్యుమార్పిడి విత్తనాల అనధికార ప్రయోగాలు సాగిస్తూనే వుంది. దొడ్డిదోవన జన్యుమార్పిడి పంటల ప్రవేశానికి ప్రయత్నాలు సాగిస్తూనే వుంది. అనేక యూరపుదేశాలతో సహా 180 ప్రపంచదేశాలు బిటి విత్తనాలను వ్యతిరేకిస్తుండగా పాలకులు మాత్రం మనదేశాన్ని మోన్‌శాంటో జన్యుమార్పిడి విత్తన ప్రయోగశాలగా మార్చేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం భారత జీవ శాస్త్రసాంకేతిక నియంత్రణాధికార సంస్థ (బ్రాయ్) ఏర్పాటుకు బిల్లును రూపొందించింది. జన్యుమార్పిడి విత్తనాల ప్రవేశాన్ని సులభతరం చేస్తూ మరోవైపున దీనినెవరూ ప్రశ్నించవీలులేకుండా ఈ బిల్లును తయారుచేశారు. అత్యంత ఆర్భాటంగా హైద్రాబాద్‌లో గత సంవత్సరం నిర్వహించిన ప్రపంచజీవ వైవిధ్య సదస్సులో సామ్రాజ్యవాద దేశాలకు ఇచ్చిన హామీ నేపథ్యంలో ఈ బిల్లుకు తుదిమెరుగులు దిద్దారనేది స్పష్టం.

ఈ నేపథ్యంలో సీనియర్ పార్లమెంటు సభ్యుడు బాసుదేవ భట్టాచార్య నేతృత్వంలో వ్యవసాయంపై ఏర్పడిన పార్లమెంటరీ స్థాయిసంఘం అనేక ముఖ్యమైన సిఫార్సులు చేసింది. జన్యుమార్పిడి పంటలపై తాత్కాలిక నిషేధాన్ని విధించాలని కోరింది. 'బ్రాయ్' బిల్లులోని నిబంధనలు రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా, అశాస్త్రీయంగా ఉన్నాయని అభిప్రాయపడింది. బిటి విత్తనాలు దేశ ప్రయోజనాలకు, రైతుల ప్రయోజనాలకు వ్యవసాయాభివృద్ధికి ఏమాత్రం ప్రయోజనకరంకావని పేర్కొంది. జన్యుమార్పిడి పంటల ద్వారా సంభవించే నష్టాలను పార్లమెంటరీ స్థాయీసంఘం సరిగ్గానే పేర్కొన్నప్పటికే అన్నింటినీ పునరాలోచించాలనీ, తిరిగి పరిశోధనలు సాగించిన అనంతరం ఆమోదం గురించి ఆలోచించాలనే సన్నాయి నొక్కులకు పరిమితమైంది మినహా, నిర్ద్వందంగా దేశ, ప్రజల ప్రయోజనాలకు హానికరమైన జన్యుమార్పిడి విత్తనాలను నిషేధించాలని పేర్కొనలేకపోయింది.

పుష్పా యం. భార్గవ వంటి జీవశాస్త్ర సాంకేతిక నిపుణులు 'భారత జీవసాంకేతిక నియంత్రణాధికార బిల్లు' రాజ్యాంగ విరుద్ధం, అనైతికం, అశాస్త్రీయం, స్వీయ ఖండితంగా వుంటూ ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా వుందని పేర్కొన్నారు.

జన్యుమార్పిడి పంటలపై వ్యాజ్యంలో సుప్రీంకోర్టు నియమించిన 'సాంకేతిక నిపుణుల కమిటీ' ఇటీవలే తన మధ్యంతర నివేదికను సమర్పించింది. ఈ నివేదికను అంతర్జాతీయంగా పేరెన్నికగన్న 50మంది సాంకేతిక నిపుణుల బృందం ఆమోదించింది. భారతదేశంలో జన్యుమార్పిడి ఆహారపంటలను వాణిజ్యపరంగా విడుదల చేయటంపైనా, క్షేత్రస్థాయిలో ప్రయోగాలపైనా రానున్న పదేళ్ళకాలం పాటు నిషేధం విధించాలని 'సాంకేతిక నిపుణుల కమిటీ' చేసిన సిఫార్సులను ఈ బృందం ఆమోదించింది.

కేంద్రప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లులోని 13వ అధ్యాయం 63వ నిబంధన ప్రకారం, శాస్త్రీయ ఆధారం లేకుండా జన్యుమార్పిడి పంటల ఉత్పత్తులను వ్యతిరేకిస్తే ఏడాదిజైలుశిక్ష, లేదా లక్ష రూపాయల జరిమానా లేదా రెండూ విధించే అవకాశం వుంది. జీవసాంకేతిక సమాచారం 'రహస్య వాణిజ్య సమాచారం' క్రిందకు వస్తుంది కనుక 'సమాచార హక్కు చట్టం' దీనికి వర్తించదని బిల్లులోని 28వ నిబంధన చెప్తోంది. జన్యుమార్పిడి ఆహారపదార్థాల మీద వివరాల సమాచారాన్ని పొందుపరచాలన్న కనీస నిబంధన కూడా ఈ బిల్లులో లేదు. పైగా రాష్ట్ర పరిధిలోనున్న వ్యవసాయరంగాన్ని కేంద్రప్రభుత్వం సంపూర్ణంగా తన చేతుల్లోకి తీసుకుంటుంది.

స్థాయీ సంఘం సిపార్సులు కానీ, సుప్రీంకోర్టు సాంకేతిక నిపుణుల కమిటీ సూచనలనుగానీ కేంద్రప్రభుత్వం పరిగణలోకి తీసుకోదలుచుకోలేదు. రానున్న పార్లమెంటు సమావేశాలలో 'బ్రాయ్' బిల్లుకు ఆమోదం పొందేందుకు పావులు కదుపుతోంది. పార్లమెంటరీ స్థాయీసంఘం, సుప్రీంకోర్టు నిపుణుల కమిటీ వంటి వేదికల ద్వారా ఉపశమన మాటలు పల్కించి, ప్రజాతంత్ర మేధావులను సంతృప్తిపరచటం, ఆపై తాము చేయాలనుకునే చర్యలను నిరాటంకంగా సాగించుకుంటూ వెళ్ళటం భారతపాలకులకు పరిపాటే.

ప్రపంచ ఆహార వ్యవస్థను శాసించేందుకు సామ్రాజ్యవాద దేశాలు-ముఖ్యంగా అమెరికా అగ్రరాజ్య సామ్రాజ్యవాదం దూకుడుగా ముందుకు సాగుతోంది. ప్రపంచ దేశాలను ఆయుధాల ఆధిపత్యంతో నియంత్రించటం, తన దారికి తెచ్చుకొని, తన దోపిడీని తీవ్రం చేసుకోవటం ఒక పార్శ్వమైతే ఆహారవ్యవస్థపై అదుపును చేజిక్కించుకోవటం ద్వారా నియంత్రించటమనే మరో మార్గాన్ని కూడా అమెరికా సామ్రాజ్యవాదం వ్యూహాత్మకంగా అమలుచేస్తోంది. కనుక, విత్తనోత్పత్తిపై ఆధిపత్యానికి, జన్యుమార్పిడి పంటలను లక్ష్యంగా చేసుకొంది. సామ్రాజ్యవాద ప్రయోజనాలకు నమ్మకమైన సేవకులుగా వున్న భారతపాలకులు వారి బహుళజాతి విత్తన కంపెనీలకు ఎర్రతివాచీ పరిచి స్వాగతిస్తున్నారు.

దేశీయ విత్తన వ్యవస్థను సంపూర్ణంగా నాశనం చేసి, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల విత్తన గుత్తాధిపత్యాన్ని సుస్థిరంచేసే 'భారత జీవసాంకేతిక నియంత్రణాధికార సంస్థ' ఏర్పాటుకు ఉద్దేశించిన 'బ్రాయ్' బిల్లును నిర్ద్వందంగా వ్యతిరేకించాలి. జన్యుమార్పిడి విత్తనాలను నిషేధించాలని, దేశీయ విత్తన వ్యవస్థను, స్వతంత్ర వ్యవసాయ విధానాన్ని పెంపొందించాలని, భారత వ్యవసాయరంగంపై సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యాన్ని, రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ పోరాడటమే రైతాంగం మరియు భారత ప్రజానీకం ముందున్న కర్తవ్యం. H




అణచబడ్డ దళితులంతా తిరగబడండి

పేజీలు : 144

వెల : రు. 50/-

కాపీలకు : మైత్రీబుక్‌హౌస్

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ-2

# గ్రామీణ రుణం సమ్మిళిత ఆర్థికాభివృద్ధి ఒక ఎండమావి

**యుపిఏ** ప్రభుత్వమూ, ప్రధాని మన్మోహన్‌సింగ్ తమ పాలనకాలంలో సాధించిన వృద్ధి ఫలితాలు ప్రజలందరికీ చెందుతున్నాయని పదేపదే చెప్పుకుంటున్నారు. దీనినే సమ్మిళిత ఆర్థికవృద్ధి అని పిలుస్తున్నారు. ఆర్థికమంత్రి చిదంబరం పార్లమెంటులో సమాధానమిస్తూ ఆర్థిక సంస్థల సేవలు అన్ని వర్గాల ప్రజలకూ అందుబాటులోకి తీసుకురావటంద్వారా సమ్మిళిత ఆర్థికవృద్ధిని సాధిస్తామని చెప్పాడు. బ్యాంకులు ఒక రూపాయి కూడా జమచేయకుండా ఖాతాలు తెరిచేందుకు అనుమతించటం, గ్రామంలో శాఖ ఏర్పాటు వ్యాపారరీత్యా అనువుగా లేనప్పుడు ఏజంట్లద్వారా లావాదేవీల నిర్వహణకు అనుమతి, ప్రైవేటు బ్యాంకులకు అనుమతి ఈ లక్ష్యసాధన కోసమేనని చెప్పాడు. అంతేకాక బ్యాంకుల శాఖలు 1980లో 16వేలు వుండగా 2002 నాటికి రెట్టింపై 32,443కు చేరాయనీ, ఇవి సేకరిస్తున్న డిపాజిట్లు అదేకాలంలో 4644 కోట్ల రూ॥ల నుండి 13,29,995 కోట్ల రూ॥లకు చేరగా, వాటి రుణవితరణ రూ॥2642 కోట్ల నుండి రు.1,59,423 కోట్లకు చేరాయనీ సమ్మిళిత ఆర్థిక వృద్ధికి ఇది నిదర్శనమనీ పేర్కొన్నాడు.

రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా "గ్రామీణ భారతంలో అనియత రుణం కొనసాగింపు–నియంత్రణా విధానాలు మారుతున్న చిత్రాన్ని గుర్తించాల్సిన అవసరం" అన్న వర్కింగ్ పేపరును తయారుచేసింది. దానిలో రిజర్వుబ్యాంకు తెలిపిన అభిప్రాయాలు ఇలా వున్నాయి. 1970–1990 మధ్య కాలంలో గ్రామాలలో "వెనక్కి నెట్టబడిన అనియత రుణాలు ఈనాడు తిరిగి కీలకపాత్ర వహిస్తున్నాయి. ప్రతి ఐదు గ్రామీణ కుటుంబాలలోనూ రెండు కుటుంబాలు అనియత రుణంపైనే ఆధారపడుతున్నాయి. ఇది గ్రామీణ భారత్‌లో సమ్మిళిత ఆర్థికవృద్ధికి వున్న ఎక్కువ అవకాశాన్ని సూచిస్తున్నది". ఇంతేకాక బ్యాంకుల శాఖలు పెరిగినంతనే గ్రామీణ రుణవితరణ పెరిగినట్లు కాదని కూడా హెచ్చరించింది.

సామాన్యుల కర్థమయ్యే మాటల్లో చెప్పుకోవాలంటే గ్రామీణ ప్రాంతంలో రుణ పరపతి అవసరాలను తీర్చటంలో ప్రైవేటు వడ్డీ వ్యాపారులే కీలకపాత్ర నిర్వహిస్తున్నారు. రిజర్వుబ్యాంకు పత్రం నుండి రూపొందించిన పట్టికను చూడండి.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి గ్రామీణ రుణంలో 93శాతం ప్రైవేటు వ్యక్తులనుండే అందుతుండగా, సంస్థాగత రుణం 7 శాతం మాత్రమే. 1971లో బ్యాంకుల జాతీయీకరణతో గ్రామీణ రుణంలో సంస్థాగత రుణం 30 శాతానికి పెరిగి 1991 నాటికి 64 శాతానికి చేరుకుంది. 1991లో నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన నాటినుండి గ్రామాల రుణాలలో సంస్థాగత రుణాలు తగ్గిపోతూ వస్తూ 2002 నాటికి 57 శాతానికి చేరాయి. తరువాయి దశాబ్దంలో 2012నాటికి 49 శాతానికి చేరిందని నేషనల్ సాంపుల్ సర్వే అంచనా. సంస్థాగత రుణంలో పెరుగుదల అంతా దాదాపుగా సహకారసంఘాలు, సహకార బ్యాంకులు, జాతీయ బ్యాంకులద్వారానే జరిగింది. తగ్గుదల కూడా వీటి రుణవితరణ తగ్గుదల వల్లే జరిగింది. 70శాతం జనాభాకు నూతన ఆర్థిక విధానాల తర్వాత రుణపరపతి సౌకర్యం తగ్గింది. ఈ అత్యధిక జనాభా సమ్మిళిత ఆర్థికవృద్ధి అన్నదానికి బయటనే వుండిపోయింది.

ఇక అనియత రుణాల పరిస్థితి చూద్దాం. సంస్థాగత రుణాలు పెరగటంతో తగ్గిన ఇవి నూతన ఆర్థిక విధానాల తర్వాత పెరిగాయి. భూస్వాములు లేదా కౌలుకిచ్చిన భూయజమానులనుండి రైతుకందుతున్న రుణాల శాతం కొద్ది హెచ్చుతగ్గుదలతో దాదాపు అదేస్థాయిలో వున్నాయి. బంధువులు స్నేహితులనుండి పొందుతున్న రుణాలు కూడా ఇదేవిధంగా వున్నాయి. ఎరువులు, క్రిమిసంహారక వ్యాపారులిచ్చే రుణాలు వాటి వాడకం పైరుపచ్చ విప్లవం అమలుజరిగిన ప్రాంతాల్లో బాగా పెరిగాయి. అయితే అఖిలభారత స్థాయిలో చూసినప్పుడు కొంత పెరిగాయి. చివరకు తగ్గాయి. అయినా ఇవి రికార్డు కావుగనుక వీరి వాటా లెక్కలకన్నా ఎక్కువగానే వుంటుంది. వీరుపోతే మిగిలింది వడ్డీ వ్యాపారులు. 1951లో వీరి వాటా 70శాతం వరకూ వుంది. 1971లో వీరి వాటా 37శాతానికి, దాదాపు సగానికి తగ్గింది. నూతన ఆర్థిక విధానాల ప్రారంభానికి మరింత తగ్గి 17 శాతానికి చేరింది. 2002 నాటికి తిరిగి 30శాతానికి పెరిగింది. 2012 నాటికి 40 శాతం దాటిందని నేషనల్ సాంపుల్ సర్వే అంచనా. దీని అర్థం స్పష్టమే. రైతాంగం తమ రుణ అవసరాలకు ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడటం నూతన ఆర్థిక విధానాల తర్వాత పెరుగుతూ వస్తున్నది.

రిజర్వుబ్యాంకు లెక్కలకు కొన్ని పరిమితులున్నాయి సూక్ష్మరుణాలు, పొదుపు గ్రూపులు, చిట్‌ఫండ్‌లను కూడా గ్రామీణ సంస్థాగత రుణాలలో కలిపి. నియత రుణంగా పేర్కొంది. వాస్తవానికి వీటిని అనియత రుణాలలో చూపాలి. అలా చూస్తే సంస్థాగత రుణం 1981లో 56.6 శాతం వుండగా 1991లో 47.6శాతానికీ, 2002లో 51.8 శాతానికీ తగ్గింది. అంటే సంస్థాగత రుణాలు రైతాంగపు అవసరాలలో సగానికంటే తక్కువగానే తీరుస్తున్నాయి.

ట్రాక్టర్లు, యంత్రపరికరాలూ, శీతల గిడ్డంగులకూ, మార్కెట్టు మౌలిక సదుపాయాలకూ ఇస్తున్న రుణాలను కూడా ప్రాధాన్యతా రంగరుణాలుగా బ్యాంకులు చూపుతున్నాయి. వీటిలో కొంతభాగం భూస్వాములకు, ధనిక రైతులకు చేరుతున్నా, ఎక్కువభాగం వ్యాపార వర్గాలకే చేరుతున్నాయి. 80శాతంగా వున్న పేద రైతాంగానికీ, కౌలురైతులకు చేరటంలేదు.

నూతన ఆర్థిక విధానాల తర్వాత బ్యాంకులకు స్వేచ్ఛనివ్వటంతో లాభసాటిగా లేవని దాదాపు 2500 శాఖలను బ్యాంకులు ఎత్తివేశాయి. అదే సమయంలో బ్యాంకు రుణాలు తీసుకుంటున్న పేదరైతుల సంఖ్య పెరగ్గా, బ్యాంకుల రుణవితరణ తగ్గించాయి. 21 రాష్ట్రాలలో 15 రాష్ట్రాలలో గ్రామీణ ప్రాంతాలకు రుణవితరణ తగ్గింది. అంటే పేద, మధ్య తరగతి రైతాంగాన్ని ప్రైవేటు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లోకి నెట్టాయి.

మరో వాస్తవమేమంటే బ్యాంకులు గ్రామీణ శాఖలద్వారా సేకరించిన డిపాజిట్లలో కొద్ది భాగం మాత్రమే (20శాతం) గ్రామీణ ప్రాంతాల్లో రుణాలుగా యిస్తున్నాయి. మిగిలిన డిపాజిట్లను నగరాలకూ, బూర్జువాలకూ సమకూరుస్తున్నాయి. మరో మాటల్లో చెప్పాలంటే నగరాల్లో ధనాఢ్య వర్గాలకు నిధులు సమకూర్చేందుకు గ్రామీణ ప్రాంతాలనుండి నిధుల సేకరణకు గ్రామీణ శాఖలను వాహకాలుగా వినియోగించుకున్నాయి. సమ్మిళిత ఆర్థిక వృద్ధి నినాదపు కార్యాచరణ ఇది.

మరో ముఖ్య మార్పు కూడా వుంది. నూతన ఆర్థిక విధానాలకు ముందు బ్యాంకుల రుణాలు ఉత్పత్తి రంగానికి అంటే రైతులకే అందించేవి. ఆ తర్వాత ఇవి అనుత్పాదక రంగాలకు కూడా యిస్తున్నాయి. దీనితో గ్రామీణ రుణం అన్న దానిలో పేద, మధ్యతరగతి రైతాంగానికి రుణాలు తగ్గిపోయాయి. దీనితో వీరూ, కౌలుదారులూ, ఏ ఆస్తీలేని వ్యవసాయ కూలీలు ప్రైవేటు వడ్డీలపై ఆధారపడటం పెరిగింది. జలగల్లా మూలుగులు పీల్చే సూక్ష్మరుణాల పెరుగుదల దీనివల్లనే జరిగింది. ప్రైవేటు వడ్డీ "కీలక పాత్ర" అన్న రిజర్వుబ్యాంకు మాటల వెనుకవున్న నిజ పరిస్థితి యిది.

అన్ని రాయితీలను ప్రత్యక్ష నగదు బదిలీద్వారా అందిస్తామంటూ బ్యాంకుఖాతాలు తెరిపించి, దానితో సమ్మిళిత ఆర్థికవృద్ధి సాధించామని భుజాలు చరుచుకోవటమే ప్రభుత్వం ఇక చేస్తుంది. ఆచరణలో ప్రజల అభివృద్ధి అన్నదాని అంచులకు కూడా చేరరు.

**గ్రామీణ రుణాలు (శాతాలలో)**

| | 1951 | 1961 | 1971 | 1981 | 1991 | 2002 |
|---|---|---|---|---|---|---|
| **1. సంస్థాగత రుణం** | **7.2** | **14.8** | **29.2** | **61.2** | **64.0** | **57.1** |
| దీనిలో ప్రభుత్వం | 3.3 | 5.3 | 6.7 | 4.0 | 5.7 | 2.3 |
| సహకారరంగం | 3.1 | 9.1 | 20.1 | 28.6 | 18.6 | 27.3 |
| బ్యాంకులు | 0.8 | 0.4 | 2.2 | 28.0 | 29.0 | 24.5 |
| బీమా | | | 0.1 | 0.3 | 0.5 | 0.3 |
| ప్రావిడెంట్ ఫండు | | | 0.1 | 0.3 | 0.9 | 0.3 |
| ఇతరాలు | | | | | 9.3 | 2.4 |
| **2. సంస్థాగతేతర రుణం** | **92.8** | **85.2** | **70.8** | **38.8** | **36.0** | **42.9** |
| దీనిలో భూస్వాములు | 1.5 | 0.9 | 8.6 | 4.0 | 4.0 | 1.0 |
| గ్రామ వడ్డీ వ్యాపారులు | 24.9 | 45.9 | 23.1 | 8.6 | 6.3 | 10.0 |
| వృత్తి వడ్డీ వ్యాపారులు | 44.8 | 14.9 | 13.8 | 8.3 | 9.4 | 19.6 |
| వ్యాపారులు,కమీషన్ ఏజంట్లు | 5.5 | 7.7 | 8.7 | 3.4 | 7.1 | 2.6 |
| బంధువులు, స్నేహితులు | 14.2 | 6.8 | 13.8 | 9.0 | 6.7 | 7.1 |
| ఇతరులు | 1.9 | 8.9 | 2.8 | 4.9 | 2.5 | 2.6 |
| మొత్తం | 100 | 100 | 100 | 100 | 100 | 100 |

ఆధారం: రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా నివేదిక

# భూపంపిణీ బూటకాన్నీ, సంక్షేమ పథకాల డొల్లతనాన్నీ వెల్లడించిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) నివేదిక

**పేదరికాన్ని** రూపుమాపేందుకు, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎన్నో చట్టాలు, సంస్కరణలు, పథకాలు ప్రవేశపెట్టామని, వారి జీవితాల్లో మార్పులు తీసుకొచ్చామని, అందుకు భూసంస్కరణలు అమలు జరిపి 50 లక్షల ఎకరాలు పేదలకు పంపిణీ చేశామని, ఇంకా విడతల వారీగా లక్షలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికోసం సబ్‌ప్లాన్ నిధులు ప్రత్యేకంగా కేటాయిస్తున్నామని, అవి వారికే ఖర్చు పెట్టేందుకు చట్టం చేసిన ఘనత తమదేనని రాష్ట్రప్రభుత్వం ఘనంగా చెప్పుకొంటున్నది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీపథకాన్ని రాష్ట్రంలో సక్రమంగా అమలు జరిపి పేదలకు పని కల్పించటం ద్వారా వారి ఆదాయం గణనీయంగా పెంచామని, ఇందిరమ్మ గృహనిర్మాణంద్వారా లక్షలాది మందికి సొంత ఇల్లు కల్పించామని, కిలో రూపాయికే పేదలకు అవకాశం కల్పించామని, గ్రామీణ గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు పోషకాహారం అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పథకంద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తెచ్చామని, ఇలాంటి పథకాలు ఇంకా ఎన్నో అమలు జరుపుతున్నామని రాష్ట్రప్రభుత్వం చెప్పే మాటల డొల్లతనాన్ని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) నిర్వహించిన సర్వే బట్టబయలు చేసింది. ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఎంత దుర్భరమైన జీవితాలు గడుపుతున్నదీ వెల్లడించింది.

రాష్ట్రం మొత్తంలో 2,10,22,588 కుటుంబాలు వుండగా, అందులో 38,71,634(15%)ఎస్సీ, 15,60,035(6.6%) ఎస్టీ కుటుంబాలు వున్నాయి. గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ వీరి జీవన పరిస్థితులు తెలుసుకొనేందుకు సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో 22 జిల్లాల్లోని 619 మండలాల్లో 5989 గ్రామాల్లో 9.8 లక్షల ఎస్సీ, ఎస్టీ ఇండ్లను పరిశీలించి నివేదిక తయారుచేసింది. ఆ నివేదికను కొద్దిరోజుల క్రితం ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఎస్సీ, ఎస్టీల సమావేశంలో సమర్పించారు. ఆ నివేదిక ఎస్సీ, ఎస్టీల దుర్భర జీవితాలకు అద్దంపట్టింది.

గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ నివేదికలో 4,45,954(65%) ఎస్సీ, 1,77,263(55%) ఎస్టీ కుటుంబాలకు సెంటు భూమిలేదని పేర్కొంది. దీన్ని గమనిస్తే పాలకుల భూసంస్కరణలు, భూపంపిణీ ఎంత బూటకమో అర్థమౌతుంది. ప్రభుత్వం ప్రచారం చేసుకొంటునట్లు 50 లక్షల ఎకరాలు పంపిణీ జరిగివుంటే, భూమి లేని ఎస్సీ, ఎస్టీలు ఇంత పెద్ద సంఖ్యలో వుండేవారు కాదు. భూసంస్కరణల లొసుగులను అవకాశంగా తీసుకొని తమ భూములు సీలింగు పరిధిలోకి రాకుండా భూస్వాములు వివిధ పద్ధతుల్లో చట్టంనుండి తప్పించుకొన్నారు. కమ్యూనిస్టు పార్టీ, వ్యవసాయ కూలీసంఘాల నాయకత్వంలో సంఘటితపడిన పేదలు (వీరిలో ఎక్కువ మంది దళితులు) బంజరు, పోరంబోకు మొదలగు భూములను ఆక్రమించి సాగుచేసుకొంటున్నారు. భూసంస్కరణల ద్వారా పంచామని చెప్పుకొంటున్న భూముల్లో 80% పేదలు సాగుచేసుకొంటున్న భూములే. ఇవికాక సేద్యానికి అనువుగా లేని రాళ్ళరప్పల భూములు, చౌడుభూములు, నీటి వనరులు లేని కొన్ని భూములు పట్టాల రూపంలో పేదలకు ఇవ్వటం జరిగింది. దీన్ని గమనిస్తే భూసంస్కరణల ప్రహసనం అర్థమౌతుంది. పేదలకు యిచ్చామని చెప్పుకొంటున్న 25 లక్షల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైనాయని, అవి భూస్వాముల, సంపన్నవర్గాల చేతుల్లోకి వెళ్లాయని, కోనేరు రంగారావు భూకమీషన్ తెలియచేసింది. ఈ భూములపై భూస్వాములకు చట్టబద్ధహక్కు కల్పించేందుకు ప్రభుత్వం 9/77 అసైన్డ్ చట్టాన్ని చేసిందంటే, ప్రభుత్వం ఎవరి ప్రయోజనాలను కాపాడుతుందో అర్థమౌతుంది. భూసంస్కరణలకు కాలం చెల్లిందని, భూకేంద్రీకరణ లేదని వాస్తవ విరుద్ధమైన ప్రచారం చేస్తూన్నవారు, తాము మూసుకున్న కళ్ళు తెరచి భూపంపిణీ ప్రాధాన్యతను గుర్తిస్తారని ఆశిద్దాం. కోనేరు రంగారావు భూకమీషన్ వివిధ రూపాల్లో పంపిణీయోగ్యమైన 60 లక్షల ఎకరాల భూములను దళితులకు, ఇతర పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ప్రభుత్వం అందుకు ఎటువంటి చర్యలూ ఇప్పటివరకు తీసుకోలేదు. చట్టసభల్లో వున్న వారిలో అత్యధికభాగం భూస్వాముల ప్రయోజనాలు కాపాడేవారేగాక, స్వతహాగా భూస్వాములు కావటమే అందుకు కారణం. అందుకే పేదలకు నిజమైన భూసంస్కరణలను అమలుజరపటంలేదు. కనుక, పేదలందరూ సమైక్యంగా ఉద్యమించి భూములను తమ స్వాధీనంలోకి తెచ్చుకొని సాగు చేసుకోవాలి.

ఎస్సీల్లో 1,35,978(21%) ఎస్టీల్లో 91,247 (28.3%) కుటుంబాలు గుడిసెల్లో నివశిస్తున్నారని, ఇందిరమ్మ పథకం క్రింద అర్హత వుండి కూడా ఎస్సీల్లో 2,98,774(45%)ఎస్టీల్లో 1,44,843(45%) కుటంబాలకు ఇళ్ళు మంజూరు కాలేదని నివేదిక వెల్లడించింది.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ఇండ్లు, ఆస్తులు కోల్పోయేది పేదలే. ముఖ్యంగా దళితులే. ఆర్థిక స్థోమతలేని వీరు ఎండకు, వానకు తలదాచుకోవటానికి కర్రలు, పుల్లలు, అడ్డంపెట్టుకొని గుడిసెలాంటి ఇంటిని ఉన్న కొద్దిపాటి సొంత జాగాలోనో లేక రోడ్డుమార్జిన్ చెరువు గట్లమీదో నిర్మించుకొని జీవిస్తారు. తుఫాన్‌లకు, భారీవర్షాలకు ఇవి కూలిపోయి నిరాశ్రయులైనప్పుడల్లా వీరికి పక్కాఇళ్ళు కట్టిస్తామని పాలకులు చెబుతూనే వుంటారు. వీరి మాటలు ఆచరణలో అమలు జరగటం లేదనటానికి పూరిగుడిసెల్లో నివశిస్తున్న వారి సంఖ్య నిదర్శనం. గుడిశె వేసుకోవటానికి సెంటు భూమిలేక నానా అవస్థలు పడే పేదలు వున్నారు. వీరికి ఇండ్లస్థలాలు పంపిణీ చేసి, ఇండ్లు కట్టుకొనేందుకు బ్యాంక్‌ల నుండి రుణాలు ఇప్పిస్తామని ప్రభుత్వంగొప్పలుచెప్పుకొంటున్నది. అర్హులైన వాస్తవ పేదలకు ఇండ్లు మంజూరు కావటం లేదని, రాజకీయపార్టీల అండవున్న పైరవీకారులకు, అధికారులను ప్రసన్నం చేయగలిగిన వారికి మాత్రమే ఇండ్లు మంజూరు అవుతున్నాయని, ఎస్సీ, ఎస్టీల్లో ఇండ్లు మంజూరు కాని వారి సంఖ్య తెలియ చేస్తున్నది. వీరిలో కొందరికి, ఇండ్లు మంజూరుఅయినా అవి పూర్తికావటం లేదు. అందుకు ప్రభుత్వం కేటాయిస్తున్న డబ్బు చాలక పోవటమే. ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీవారి ఇండ్లనిర్మాణానికి 72వేలు ప్రకటించింది. ఆ డబ్బు కూడా లబ్ధిదారులు పునాదులు నిర్మించినప్పుడే విడతల వారీగా బ్యాంక్‌నుండి డబ్బులు, సిమెంట్ తీసుకోవాలి. ఎటువంటి స్థోమతాలేని పేదలు ముందుగా ఇంటి నిర్మాణానికి డబ్బు ఎలా తేగలరనే జ్ఞానం కూడా పాలకులకు లేదు. స్లాబ్‌వేసిన యింటికే ఈ కేటాయింపు కాగా, రేకుల ఇళ్ళు వేసుకోవటానికి ఒప్పుకోరు. ఒక్కగది ఇంటికి స్లాబ్ పోయాలన్నా కనీసం రెండు లక్షలకు పైగా అవుతుంది. ప్రభుత్వంయిచ్చేది 72వేలు. మిగతా డబ్బులు పేదలైన ఎస్టీ, ఎస్సీలు ఎక్కడినుండి తేగలరు? అందుకే లక్షలాదిగా వారిఇళ్ళు సగంలో ఆగిపోతున్నాయి. అప్పులు మాత్రం వారికి మిగులుతున్నాయి. **(తరువాయి 6వ పేజీలో)**

# ఫ్యూడల్ నీతికి కాపలా భటులు

**భారత** పాలకవర్గాలు తమ దోపిడీ అణచివేత పాలనలో భాగంగా ఎన్ని ప్రగతిశీల భావాలను వెల్లడించినప్పటికీ, కాలం చెల్లిపోయి కుళ్ళికంపుగొడుతున్న భూస్వామ్య నీతికి కావలి భటులుగా వ్యవహరిస్తున్నారనటానికి నిరూపణగా ఇటీవలి రెండు ఘటనలున్నాయి. ఒకటి ముంబై మహానగర పాలిక చేసిన తీర్మానంకాగా, రెండవది చెన్నై హైకోర్టు న్యాయమూర్తి తీర్పుపై రేపిన దుమారం.

ఢిల్లీలో నిర్భయపై సాగిన అత్యాచారం ప్రజాగ్రహాన్ని వెలికి తెచ్చింది. దోషులను కఠినంగా శిక్షించాలనీ, మహిళలపై అత్యాచారాల నివారణకు చర్యలు తీసుకోవాలనీ ప్రజా ఉద్యమం డిమాండు చేసింది. ప్రజాభిప్రాయానికి తప్పనిసరై తలొగ్గిన పాలకులు నిర్భయచట్టాన్నొక దాన్ని చేశారు. తమ చేతులు కడుక్కున్నారు. అత్యాచారానికి గురైన మహిళలు న్యాయం పొందటాన్ని పోలీసుల దయా దాక్షిణ్యాలకూ, లీగల్ లిటిగేషన్లకూ వదలివేశారు.

కాగా అదే సమయంలో అత్యాచారాలకు కారణాన్ని మహిళలపైనే మోపారు. పొద్దుపోయేవరకు స్నేహితులతో తిరగటం అత్యాచారానికి అవకాశమివ్వటం కాదా? పురుషులను రెచ్చగొట్టి బలాత్కారాలకు పూనుకొనే విధంగా వస్త్రధారణ చేయటం సమంజసమేనా అంటూ మహిళలదే తప్పన్న వాదనలతో మహిళల వస్త్రధారణకు నిబంధనలు విధించే పనికి పూనుకున్నారు. కాంగ్రెసుతోపాటు సంస్కృతి పరిరక్షకులుగా తమకుతామే చెప్పుకొనే హిందూత్వ సంఘ పరివారం ఈ వాదనలలో ముందుంది.

మహిళలపై అత్యాచారాలు ఎంత విచ్చలవిడిగా సాగుతున్నాయో నిర్భయ ఘటనతో దాని వాణిజ్య విలువ తెలుసుకున్న పత్రికలు తెస్తున్న వార్తలపరంపర తెలుపుతుండగా, ఈ సామాజిక నేరాన్ని అదుపుచేసేందుకు (నిర్మూలించటమెలాగూ ఈ పాలకులు చెయ్యరు) తీసుకోవలసిన సామాజిక, రాజకీయ, చట్టపర చర్యల గురించి ఆలోచించకపోగా సరికొత్త పద్ధతులను కనుగొనే పనిలో ఈ సాంస్కృతిక పోలీసులు పడ్డారు.

దీనిలో భాగంగా ముంబాయి మహానగర పాలికలో శివసేన పార్టీ కార్పొరేటరు రీతూ తవాడే ఒక సరికొత్త పద్ధతిని కనుగొంది. బట్టలషాపులలోని అద్దాలషోకేసులలో మహిళల బొమ్మలకు రకరకాల వస్త్రాలు ధరింపచేసి ప్రదర్శిస్తున్నారనీ, దీనివల్ల దారినపోతున్న పురుషులు ఈ బొమ్మలను చూసి కామోద్రేకులై బలాత్కారాలకు పాల్పడుతున్నారనీ వాదించింది. షాపుల షోకేసులలో బొమ్మలుంచటాన్ని నిషేధించాలని తీర్మానం పెట్టింది. స్త్రీల వస్త్రధారణ పురుషులను రెచ్చగొట్టడమే బలాత్కారాలకు కారణమన్న వాదనకు మరోరూపమే ప్రస్తుత తీర్మానమన్న విమర్శ చేయాలన్న తలంపుకూడా రాకుండా అన్ని పార్టీలకు చెందిన కార్పొరేటర్లూ ఈ తీర్మానాన్ని సమర్ధించారు. ఏకగ్రీవంగా ఆమోదించారు. స్త్రీ అంగాంగాలను వాణిజ్య ప్రయోజనాలకు వాడుకునే నికృష్ట సంస్కృతికి మూలం పెట్టుబడిదారీ విధానమన్న నిజాన్ని ఏ ఒక్కరూ పలుకలేదు. కాగా స్త్రీల వస్త్రధారణే కారణమని ఈ తీర్మానం ద్వారా నిర్ధారించారీ భూస్వామ్య నీతికి కాపలాదారులు.

తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి కన్నన్ ఒక కేసులో (కలిసి జీవనం గడిపి, పిల్లలను కని ఇప్పుడు దూరమై తనకు ఏ బాధ్యతలేదన్న పురుషుడు) లైంగిక పొందు సాగిస్తూ కలిసిజీవిస్తున్న జంటకు చట్టబద్ధంగా పెళ్ళిజరిగి ఆలుమగలుగా వుంటున్న వారికుండే చట్టబద్ధ హక్కులనూ, బాధ్యతలనూ వర్తింపచేయాలని తీర్పునిచ్చారు.

ఈ తీర్పుపై నైతిక వాదులు దుమారం లేవదీశారు. పెళ్ళిచేసుకోకుండానే శృంగారంలోపాల్గొనే విచ్చలవిడి తనం పేట్రేగిపోతుందని వాపోయారు. ప్రపంచానికే తలమానికమైన భారతకుటుంబ వ్యవస్థకు గొడ్డలిపెట్టని వగచారు.

పెళ్ళిచేసుకోకుండా లైంగిక సంబంధాలు పెట్టుకుని పిల్లలనుకని వదిలేసిపోతే అలాంటి మహిళల రక్షణకు ఈ తీర్పుయిచ్చానని న్యాయమూర్తి వివరణ యిచ్చినా వీరు శాంతించలేదు.

న్యాయమూర్తి తన పరిధిని దాటారనీ, కలిసి జీవించటాన్ని పెళ్ళినీ సమానంచేసే అధికారం న్యాయమూర్తికిలేదనీ, చట్టసభలే అలాచేయాలనీ లీగలు వాదనలు తెచ్చారు. కఠినవాస్తవాలు తప్పుడు తీర్పులకు దారి తీస్తాయన్న సూత్రం న్యాయశాస్త్రంలో వుందనీ, ఈ కేసులో తిరుగులేని వాస్తవాలను చూసి యిచ్చిన తీర్పు తప్పుపర్యవసానాలకు దారితీస్తున్నదనీ, లీగలు పాండిత్యమంతా చూపారు.

విడాకులు మంజూరుచేసే అధికారం తప్ప పెళ్ళి దరఖాస్తులు స్వీకరించే అధికారంలేని న్యాయస్థానానికి పెళ్ళిని కలిసి జీవనంలో సమానంచేసే అధికారమెక్కడిదని మొండి వాదనలూ చేశారు.

ఆధునిక వేషం ధరించి న్యాయకోవిదుడుగా రూపం దాల్చిన ఆవర్జా పద్దుల నిపుణుడొకరు గణాంకాలతో పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళ గొప్పదనాన్ని నిరూపించ బూనుకున్నాడు. భారతదేశంలో 86శాతం పెళ్ళిళ్ళు పెద్దలు కుదిర్చిన తమ తమ కులాలలోనే జరుగుతున్నాయనీ, కాగా వీటిలో ఒక శాతమే విడాకులవుతున్నాయనీ, అదే సమయంలో అమెరికాలో 90శాతం ప్రేమపెళ్ళిళ్ళు కాగా వాటిలో సగం విడాకులకు దారితీస్తున్నాయని చెబుతూ సాంప్రదాయక స్వంత కులంలో పెళ్ళి, కుటుంబం ఉన్నతమైనదని వాదించాడు. ఈ సాంప్రదాయక పెళ్ళి, కుటుంబమన్న సాంఘిక వ్యవస్థను శుష్క చట్టపర ఒప్పందంగా న్యాయస్థానాలు దిగజార్చటం సమాజమన్నదే లేదన్న అరాచకత్వానికి దారితీస్తుందని వాదించాడు.

ఈ వాదనల సారాంశమొక్కటే : మహిళలకు ప్రజాస్వామిక సమానహక్కుల్లేని భూస్వామ్య కుటుంబ వ్యవస్థే గొప్పది. స్త్రీ పురుషులు తమ ఇష్టాలతో దగ్గరయ్యే ప్రేమపెళ్ళిళ్ళు అనర్ధదాయకం. విడాకులకు దారితీస్తాయి. సామాజిక ఆమోదంలేని పెళ్ళినిలబడదు. ఇక పెళ్ళంటూ లేని కలసిజీవనం ఏవిధంగానూ వాంఛనీయం కాదు. వాటిని అనుమతించరాదు.

ఈ వాదనలోని తిరోగమన ధోరణీ, గత భూస్వామ్య సమాజమే మంచిదన్న దృష్టీ స్పష్టమే. న్యాయమూర్తి కన్నన్ తన తీర్పులో మంగళ సూత్రధారణ, అగ్నిప్రదక్షిణా, దండలూ, ఉంగరాలు మార్చుకోవటం వంటివన్నీ సమాజ తృప్తి కొరకు పాటించే ఆచారాలు తప్ప పెళ్ళికి తప్పనిసరి షరతులు కాదని వ్యాఖ్యానించటం వీరికి ఆగ్రహాన్ని తెప్పించింది. మొత్తం భూస్వామ్య ఆచారసాంప్రదాయాలనే కాదన్నాడన్నది వీరి దుగ్ధ.

ఈ సాంప్రదాయ సమర్ధకుల వాదనల్లో దాగివున్న అసలు సత్యమేమంటే స్త్రీనిలైంగికంగా వినియోగించుకుని మోజుతీరిన తర్వాత వదలివేయటం పురుషుడి జన్మహక్కు అన్నభావన.

న్యాయస్థానం జోక్యం లేదా తీర్పుల వల్ల సమాజంలో విలువలు దిగజారిపోతున్నాయనటం వాస్తవాన్ని తలక్రిందులుగా చూడటమే. మహిళల అణచివేత, లైంగిక వినియోగం పురుషుల "మగతనం"గా ఆమోదిస్తున్న కుళ్ళిపోయిన విలువల వల్ల సమాజం దిగజారిపోతున్నదన్న వాస్తవాన్ని వీరు గుర్తించ నిరాకరిస్తున్నారు. సాంప్రదాయక పెళ్ళి – కుటుంబ వ్యవస్థ ఔన్నత్యాన్ని గురించి వీరెన్ని మాటలు చెప్పినా, ఆచారాలూ, కట్నకానుకలు లేకుండా "మీటింగు" పెళ్ళిళ్ళు, పెళ్ళితంతు లేకుండా కలిసి సహజీవనం ఈనాడు భారత సమాజంలో ఒక వాస్తవంగా సాగుతున్నదనీ దీని నుండి తలెత్తుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించే ప్రయత్నమే న్యాయమూర్తి కన్నన్ ఇచ్చిన తీర్పు అనీ వీరెంత తొందరగా గుర్తిస్తే సమాజానికి అంత మేలుచేసిన వారవుతారు.

ఇటు అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజం వున్న భారత్‌లోగానీ, అటు అభివృద్ధి పొందాయంటున్న పశ్చిమ పెట్టుబడిదారీ – సామ్రాజ్యవాద సమాజంలోకానీ పెళ్ళి – కుటుంబ వ్యవస్థలు సంక్షోభస్థితిలో వున్నాయి. కాలం చెల్లిన భూస్వామ్య కుటుంబవ్యవస్థ అణచివేతనుండీ, ఊపిరిసలుపనివ్వని పెట్టుబడిదారీ వ్యష్టి వినిమయ సంస్కృతి సమిష్టి విలువల రాహిత్యం నుండీ బయట పడాలన్నతపన భారత్‌లోనూ, స్త్రీ అంగాంగాన్నీ భోగాలాలస సరుకుగా మారుస్తున్న సామ్రాజ్యవాద క్షీణసంస్కృతి నుండీ బయటపడాలన్న తపన పశ్చిమ దేశాలలోనూ పెళ్ళి, కుటుంబ వ్యవస్థలెదుర్కొంటున్న సంక్షోభాన్ని తెలుపుతున్నాయి.

గత సమాజంలోని తప్పులనూ, లోపాలనూ గమనించి, వాటిని తొలగించుకునేందుకు క్రొత్తదారిని నడుస్తున్నప్పుడు తప్పటడుగులు సహజం. వాటిని సరిదిద్దుకునేందుకు నూతన విలువలు సృష్టించుకోవాలి. ఆ నూతన విలువలు స్త్రీ పురుషులకు సమానత్వాన్నిచ్చే ప్రజాస్వామిక స్వభావాన్ని కలిగివుండాలి. దీనిలో మూడవ వ్యక్తికి జన్మనిచ్చి సమాజ మనుగడ కొనసాగింపుకు కారణమౌతున్న స్త్రీ–పురుష సంబంధాలు సామాజిక బాధ్యతను నెరవేర్చే విలువలను కూడా కలిగివుండాలి. ఆ విలువలు ఏర్పడానికి ఏ అమరికలూ లేని, మరేయితర ప్రలోభాలూ ప్రభావితం చెయ్యని స్వచ్ఛమైన యిష్టపూరిత ప్రేమ, స్త్రీ పురుషులను దగ్గర చేర్చగల సహజీవన విలువలు ఏర్పరచుకోగలిగిన సామాజిక, రాజకీయ, ఆర్ధిక పరిస్థితులు ఏర్పడాలి. సోషలిస్టు సమాజమే అలాంటి విలువలను నెలకొల్పగలుగుతుంది.

గత భూస్వామిక విలువలను కీర్తిస్తూ, అవి బీటలు వారిపోతున్నాయని వాపోతూ, మరోవైపున సమాజ సమిష్టి జీవనాన్ని ప్రక్కకు నెట్టివేసి, వ్యక్తికే అగ్రస్థానమిచ్చే సామ్రాజ్యవాద క్షీణసంస్కృతిని ఆదర్శంగా చూపిస్తూ, అదే సమయంలో వ్యక్తిచుట్టూనే విలువలు నిర్మించే పెట్టుబడిదారీ సంస్కృతి స్త్రీ పురుషుల సహజీవనాన్ని స్వలింగసంపర్కంతో పోటీపెడుతున్న వెర్రితలలను చూపి కాలంచెల్లిన విలువలను కాపాడే ప్రయత్నాలతో భారతదేశంలోని దోపిడీ వ్యవస్థా, దాని పాలకులూ వంది మగధులూ చేస్తున్నదంతా సరైన ప్రజాస్వామిక విలువలు నెలకొననివ్వని ప్రయత్నమే. కుటుంబమూ–పెళ్ళివ్యవస్థ కొచ్చేసరికి ప్రజాస్వామిక విలువలు వాటి దరిచేరకుండా ఈ ప్రతీపశక్తులు బరితెగించి రంగంలోకి దిగుతాయి.

దోపిడీ వ్యవస్థ సృజిస్తున్న ఆటంకాలనధిగమించి, భూస్వామ్య సంస్కృతి క్షీణవిలువలను తిరస్కరించి, వ్యక్తిసౌఖ్యాన్ని పరమావధిగా చేస్తున్న సామ్రాజ్యవాద ప్రగతి నిరోధక సంస్కృతి ప్రలోభాలకు లోనుకాకుండా, స్త్రీ పురుష సంబంధాలలో సరైన ప్రజాస్వామిక విలువల స్థాపనకు పూనుకోవాలి. H

# ఎవరికొంపలార్పి గుజరాత్ ప్రకాశిస్తున్నది?

నరేంద్రమోడి నాయకత్వాన గుజరాత్ అభివృద్ధి నమూనాను భారత్ ముందుంచిందన్న ప్రచారంతో భాజాపా లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమౌతున్నది అందువల్ల నరేంద్రమోడీకి భారతప్రధాని అయ్యే అర్హత వున్నదని చెప్పుకుంటున్నది. బూర్జువా పత్రికలు దీనికి వంత పాడుతున్నాయి. "అభివృద్ధి నమూనా" అని పొగడటం తప్ప ఎవరి అభివృద్ధి, ఎవరి వినాశనం అన్న ప్రశ్నలు రాకుండా చేస్తున్నాయి.

2002లో గుజరాత్‌లో ముస్లిముల ఊచకోత ద్వారా భయోత్పాత వాతావరణాన్ని సృష్టించి, ప్రజల కనీస హక్కులు కాలరాచి విదేశీ కంపెనీలకు రాష్ట్ర వనరులను ధారాదత్తం చేయటమే "అభివృద్ధి నమూనా".

అహమ్మదాబాద్ జిల్లా, మండల్ తాలూకా, హంసల్‌పూర్ గ్రామరైతులు తమ భూములు తిరిగి తమకు అప్పగించమని న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, గడపలన్నీ దాటి ఇప్పుడు గుజరాత్ హైకోర్టు ముందుకు విచారణకు వచ్చింది. రైతులు న్యాయస్థానానికి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. 1950 నుండీ తమ పూర్వీకులూ తామూ సాగుచేసుకుంటున్న 200 ఎకరాల భూమిని గుజరాత్ పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ తమ నుండి బలవంతంగా గుంజుకున్నది. దానిని మారుతీ సుజుకీ కార్లకంపెనీకి కట్టబెట్టింది. కార్పొరేషన్ అధికారులూ, మామ్లత్‌దార్ (అక్కడ తాసిల్దారును ఇలా పిలుస్తారు)లు తమను బెదిరించి బలవంతంగా భూమినుండి గెంటివేశారు. ఇది వివాదాస్పద భూమి గనుక మీకు హక్కు లేదని నష్టపరిహారం కూడా చెల్లించేదిలేదని తమను బలవంతంగా గెంటివేశారు. ఈ భూమి వివాదాస్పదం కాదనీ, రెవిన్యూ అధికారుల రికార్డుల ప్రకారమే 1941–42 నుండి భూమి తమ స్వాధీనంలో వున్నట్లుగా, తాము సాగుచేస్తున్నట్లుగా నిరూపితమైంది కనుక తమ భూమిని తిరిగి తమకప్పగించమనీ, మొత్తం రికార్డులను పరిశీలించేందుకు న్యాయస్థానంకమీషనర్‌ను నియమించాలనీ కోరారు. క్రింది కోర్టులలో లిటిగేషన్‌తో ప్రభుత్వంకేసును సాగలాగుతుండటంతో రైతులు హైకోర్టునాశ్రయించారు.

మండల్–బెఛ్రాజీ ప్రత్యేక పెట్టుబడి మండలిగా అహమ్మదాబాద్ జిల్లాలో ఒక ప్రాంతాన్ని ప్రకటించింది. దీనిక్రింద 10వేల ఎకరాలను గుజరాత్ పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్‌కు అప్పగిస్తూ జిఓ యిచ్చింది. దీనిలో 200 ఎకరాలను మారుతీకార్ల కంపెనీకి కేటాయించారు. ఇదికాక మరో 700 ఎకరాలు ప్రక్కనున్న విఠల్‌పూర్ గ్రామం నుండి కేటాయించారు.

భూమి యజమాని ఎవరన్నది వివాదమైనప్పుడు, అసలు హక్కుదారెవరో రికార్డుల ప్రకారం తేల్చేవరకూ ప్రస్తుతం సాగులో లేదా స్వాధీనంలో వున్నవారిని తొలగించరాదని చట్టం నిర్దేశిస్తున్నది. తనచట్టాన్ని తానే కాలరాచి, వివాదాస్పద భూమి అని సాకు చూపి రైతాంగాన్ని గెంటివేసింది మోడీ ప్రభుత్వం. భూసేకరణ చట్టంవుంది. ప్రజల ఆస్థిహక్కు అనుల్లంఘనీయమన్న రాజ్యాంగచట్టముంది. అయినా చట్టబద్ధ పాలనను సాగిస్తానని ప్రమాణంచేసి గద్దెనెక్కిన మోడీ చట్టాన్ని, ప్రజల హక్కులను కాలరాసాడు.

నిర్బంధ భూసేకరణను దేశమంతటా రైతాంగం ప్రతిఘటిస్తుండగా, ప్రజలకు వెసులుబాటునిచ్చే విధంగా సవరణలు చేస్తానంటూ శుష్కవాగ్దానాలతో కాలం వెళ్ళ బుచ్చుతూ, పాతచట్టంతోటే రైతాంగాన్ని వెళ్ళగొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మోడి సాగిస్తున్న అడ్డగోలు వ్యవహారంపై మౌనం పాటించడం ఆశ్చర్యాన్ని కలిగించదు. రైతాంగ జీవితాలను ధ్వంసం చేసి భూములు తమకప్పగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని రిలయన్సు అంబానీ వంటి బడా బూర్జువాలు పొగడటమూ ఆశ్చర్యాన్ని కలిగించదు. సవరణలంటూ ప్రజలను భ్రమపెట్టి రైతాంగాన్ని భూముల నుండి గెంటివేస్తున్న తన విధానమే మెరుగైనదని బడా బూర్జువాలను నమ్మించే పనిలో కాంగ్రెసు వుండగా, తన హిందుత్వ దూకుడుతో మీ కోర్కెలు తక్షణమే ఈడేరుస్తానంటూ మోడీ దోపిడీ వర్గాలను ఆకర్షిస్తున్నాడు.

కాంగ్రెసు–బిజెపి ఒక తానులో రెండు గుడ్డలు. అంతిమంగా రైతాంగం కొంపలార్పి, దోపిడీ వర్గాలకు వెలుగు నింపుతాయి. దానినే అభివృద్ధి నమూనాగా చిత్రిస్తాయి. H

## భూ పంపిణీ...(ఐదవపేజీ తరువాయి)

చివరికి అవి ఇతరుల పరమౌతున్నాయి. ఇతర కులాల్లోని పేదలకు ఇంటి నిర్మాణానికి యిచ్చేది ఇంకా తక్కువ. ప్రభుత్వం యిచ్చే సొమ్ముతోపాటు, అదనంగా డబ్బు తెచ్చుకోగలిగిన వారే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోగలుగుతున్నారు. అందువలన పేదలకు డబ్బులు కాకుండా ప్రభుత్వమే ఇండ్లు కట్టించి యివ్వాలనే డిమాండ్‌తో అన్ని కులాల్లోని పేదలు ఉద్యమించాలి.

నివేదికలోని మరో ముఖ్యమైన అంశం గ్రామీణ ఉపాధి హామీపథకం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం గురించి యు.పి.ఏ.ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకొంటున్నాయి. ప్రతి కుటుంబానికి సంవత్సరంలో వందరోజుల పని కల్పిస్తున్నామని, తద్వారా ఉపాధి పెరిగి వారి కుటుంబాల ఆదాయం పెరిగి అభివృద్ధిపథంలో పయనిస్తున్నారని, పేదరికం నిర్మూలించబడుతోందనే ప్రచార హోరును పాలకులు సాగిస్తున్నారు. ఇప్పటికే ఈ పథకం ఆచరణలో విఫలమైందనే వాస్తవం బయటపడింది. వందరోజులు పని దొరికిన కుటుంబాలు వందల్లోనే వున్నాయి. సగటున 28 రోజులకు మించి ఉపాధి పనులను కల్పించలేక పోయింది. ఇప్పటి అర్హులైన లక్షలాదిమంది పేదలకు జాబ్ కార్డులే ఇవ్వలేదు. వారికి లభించే కూలి కూడా చాలా తక్కువగా వుంది. ఈ వాస్తవాన్ని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ తన నివేదికలో కూడా పేర్కొంది. గ్రామీణ ఉపాధి పనులు చేసేవారిలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీలకు చెందిన పేదలే. వీరిలో చాలామందికి జాబ్‌కార్డులే రాలేదు. నివేదికలో పేర్కొన్న దానిప్రకారం రాష్ట్రంలో 2,57,539(39%) ఎస్సీ, 1,23,993(38%) ఎస్టీ కుటుంబాల వారికి గ్రామీణ ఉపాధి హామీ పథకంక్రింద జాబ్ కార్డులు రాకపోవటమే అందుకు నిదర్శనం. ఈ వాస్తవాలను పరిశీలించినపుడు ఉపాధి హామీ పథకం పేదలకు పనికల్పించటంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని స్పష్టమౌతోంది. కొద్దిపాటిగా లభిస్తున్న పనులకు కూడా శఠగోపం పెట్టేందుకు, పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు చర్యలు ప్రారంభమైనాయి.

దరిద్రరేఖకు దిగువన జీవిస్తున్న పేదలందరికీ రేషన్‌కార్డులు ఇచ్చి కిలో రూపాయికే బియ్యం, చౌకగా ఇతర వస్తువులు ఇస్తున్నామని రాష్ట్రప్రభుత్వం చెబుతున్నది. ఈ పథకం ప్రారంభించి దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ అర్హులైన లక్షలాది మంది నిరుపేదలకు రేషన్ కార్డులు లేక ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ అంశాన్ని కూడా నివేదికలో పొందుపర్చారు. ఎస్సీల్లోని 97,782 (15%), ఎస్టీల్లోని 63,232 కుటుంబాలకు రాష్ట్రంలో రేషన్‌కార్డులు లభించలేదు.

దేశంలోనూ, రాష్ట్రంలోనూ కోట్లాదిమంది పేదరికంతో కనీస అవసరాలను కూడా తీర్చుకోలేని దయనీయ స్థితిలో వున్నారు. ఉపాధి అవకాశాలు తరిగిపోతూ, చేసుకొందామంటే పనిలేక, వచ్చే ఆదాయంతో కుటుంబ కనీస అవసరాలు తీరక పేదలు కడు దుర్భర జీవితాలు గడుపుతున్నారు. ప్రభుత్వంలోనే భాగమైన జాతీయ నమూనా సర్వే సంస్థ(ఎన్ఎస్ఎస్ఓ) 10–6–2013న విడుదల చేసిన గణాంకాలు ఈ వాస్తవానికి అద్దంపడుతున్నాయి. జులై 2011 – జూన్ 2012ల మధ్యలో ఎన్ఎస్ఎస్ఓ 7,489 పల్లెల్లోను 5,288 పట్టణాల్లోనూ సర్వే నిర్వహించింది. ప్రజల జీవన పరిస్థితులను, రోజువారి కుటుంబ ఖర్చును అధ్యయనం చేసింది. పల్లెల్లో పేదలు రోజుకి 17 రూ, పట్టణాల్లో 23 రూ. మాత్రమే ఖర్చుచేస్తున్నారని సర్వేలో తెలిపింది. ఇంత స్వల్పఖర్చుతో ఎలా బ్రతుకుతున్నారోనని చాలామంది తలలు బాదుకొంటున్నారు. పేదలకు వచ్చే ఆదాయం ఒకపూట తిండికి కూడా సరిపోవటంలేదు. ఫలితంగా తినీతినకా ఆకలి పేగులతో బ్రతుకు లీడుస్తున్నారు.

అర్ధాకలితో, ఆకలి పేగులతో జీవితం గడుపుతున్న పేదలు అనేక దీర్ఘకాలిక రోగాలకు గురౌతున్నారు. అసలే తిండిలేని వీరు (తరువాయి 7వ పేజీలో)

# యురేనియం తవ్వకాలను అనంతపురం జిల్లాకు విస్తరించే ప్రయత్నాలు-ప్రజల వ్యతిరేకత

**కడపజిల్లా** పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేముల మండలం, ఎం.తుమ్మలపల్లెవద్ద 1110 కోట్ల రూ॥ల వ్యయంతో భారత ప్రభుత్వం చేపట్టిన యురేనియం ఖనిజ తవ్వకాలు, యురేనియం శుద్ధి కర్మాగారం ప్రజలు, పశువులు, పర్యావరణంపై ఇప్పటికే తీవ్ర దుష్ప్రభావాలను చూపుతున్నాయి.

యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఐఎల్) ఆధ్వర్యంలో సాగుతున్న ఈ ఖనిజ తవ్వకాలను రోజుకు 3వేల టన్నులనుండి 4,500 టన్నులకు పెంచేందుకు అనుమతినీయవలసిందిగా ఆ సంస్థ కేంద్రప్రభుత్వాన్ని కోరింది. తదనుగుణంగా మే 30వ తేదీన ప్రజాభిప్రాయసేకరణ తంతు జరిపేందుకు పూనుకుంది.

ఈ ప్రజాభిప్రాయసేకరణ కోసం రూపొందించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక పూర్తి అసత్యాలు, అవాస్తవాలతో తప్పుల తడకలా వుంది. యురేనియం తవ్వకాలు, శుద్ధి, వ్యర్థాలు - పర్యావరణంపై దాని దుష్ప్రభావాలను నివేదిక కప్పిపుచ్చింది.

వాస్తవానికి ఇప్పటికే వేములమండలంలోని తుమ్మలపల్లె, భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె, కొత్తాల, మబ్బుచింతపల్లె తదితర గ్రామాల్లోని వందలాది బోర్లలో నీరు అడుగంటిపోయింది. కాగా, పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో యురేనియం తవ్వకాలు - శుద్ధి - వ్యర్థాలు భూగర్భ జలాలపై ఎలాంటి ప్రభావం చూపవని పేర్కొన్నారు.

యురేనియం తవ్వకాలు, శుద్ధికర్మాగారంనుండి వెలువడే విషవాయువులు, వ్యర్థాలు ఇప్పటికే పది కిలోమీటర్ల పరిధిలో విస్తరించాయి. కర్మాగార వ్యర్థజలాలలోకి దిగిన పశువుల చర్మం ఊడిపోయింది. వ్యర్థజలాలు పారిన మేరా మొక్కలు ఎండిపోయాయి. పశువులు చూలుకట్టే శక్తిని కోల్పోతున్నాయి. యువకులనుండి వృద్ధుల వరకు కీళ్ళనొప్పులతో బాధపడుతున్నారు. కొందరికి చర్మవ్యాధులు, లైంగిక సమస్యలు, క్యాన్సర్‌వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. యురేనియం ఖనిజంలోని అణుధార్మికతతోపాటుగా, యురేనియం శుద్ధిలో పెద్దఎత్తున వినియోగించే సల్ఫ్యూరిక్ ఆమ్లం ఫలితంగా ఈ దుష్పరిణామాలన్నీ చోటుచేసుకుంటున్నాయి.

యురేనియం ప్రాజెక్టు ప్రారంభానికి ముందు ఈ ప్రాంతంలో ప్రజలరక్త నమూనాలను, భూగర్భ జలాల నమూనాలు సేకరించి పరీక్షించి వివరాలు నమోదు చేశారు. కాగా, ప్రస్తుతం పైన పేర్కొన్న విధంగా అనేక సమస్యలతో ప్రజలు బాధపడుతున్నా, కాలుష్య తీవ్రత బయటపడుతుందనే కారణంగా, ఇప్పుడు తిరిగి రక్తపరీక్షలు, భూగర్భజల పరీక్షలు చేయటానికి సిద్ధం కావటంలేదు.

రాయలసీమ ప్రాంతంలో ప్రజలు తీవ్ర త్రాగునీరు, సాగునీరు సమస్యనెదుర్కొంటుండగా, యురేనియం శుద్ధికర్మాగార నీటి అవసరాలకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌నుండి రోజుకు ఆరువేల ఘనపు మీటర్ల నీటిని మళ్ళించటానికి ప్రభుత్వంఅనుమతించింది. యురేనియం ఖనిజ తవ్వకాలను రోజుకు 4,500 టన్నులకు పెంచితే మరింత నీటి తరలింపుతో వ్యవసాయ అవసరాలకు, తాగునీటి అవసరాలకు తీవ్ర కొరత ఏర్పడనుంది.

కడపజిల్లా వేంపెంట, వేముల మండలాల్లో యురేనియం ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన గ్రామసభల్లో ప్రజలు యురేనియం ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకించారు.

కాగా, కడప జిల్లాలోని యురేనియం శుద్ధి కర్మాగారానికి సమీపంలోని అనంతపురం జిల్లా కదిరి, తలుపుల ప్రాంతాలలో-ముఖ్యంగా తలుపులమండలం సోమలవాండ్లపల్లి, వెలగలబైలు తదితర గ్రామాలలో ఇప్పటికే అణుధార్మికత దుష్ఫలితాలు కన్పిస్తున్నాయి.

యురేనియం నిక్షేపాలు ఉన్న ప్రాంతంగా గుర్తించి కడపజిల్లా సరిహద్దులోని అనంతపురంజిల్లా నంబుల పూలకుంట మండలంలోని ఐదు వేలఎకరాల సాగు భూములలో యురేనియం ఖనిజ తవ్వకాలకోసం, శుద్ధి కర్మాగార నిర్మాణంకోసం యుసిఐఎల్, బార్క్ సంస్థలు కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. ఇప్పటికే ఎదురౌతున్న చేదు అనుభవాలతో, ఈ ప్రతిపాదనలను ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

మేఘాలయ కొండల్లోనూ, కర్ణాటకలోనూ, మన రాష్ట్రంలోని కడపలోనేగాక నల్గొండజిల్లా తదితర ప్రాంతాల్లో యురేనియం ఖనిజాల అన్వేషణ, తవ్వకాలను భారత ప్రభుత్వం పెద్దఎత్తున సాగిస్తోంది. వివిధ ప్రపంచ దేశాలలో తీవ్ర ప్రజావ్యతిరేకత ఫలితంగా, ఆయా దేశాల్లో అణువిద్యుత్తు కేంద్రాలను రద్దుచేసుకొంటుండగా, సామ్రాజ్యవాదుల సేవలో తరిస్తున్న భారత ప్రభుత్వం 2020 నాటికి 63వేల మెగావాట్ల అణువిద్యుదుత్పత్తి సాధించాలనే లక్ష్యంతో దేశప్రయోజనాలు, ప్రజల ప్రాణాలను పణంగా పెట్టేందుకు ముందుకు సాగుతోంది. అంతేగాక అణ్వాయుధాల తయారీకవసరమైన శుద్ధిచేసిన యురేనియం, మరియు ప్లూటోనియం, థోరియంలను సామ్రాజ్యవాదులకు - ముఖ్యంగా అమెరికా అగ్రరాజ్య యుద్ధప్రయోజనాలకు అనుగుణంగా తరలిస్తోంది.

యురేనియం తవ్వకం, శుద్ధి పరిశ్రమల నుండి వెలువడే అణుధార్మికత, కాలుష్యం, అవి కలిగించే పర్యావరణ హాని తదితర దుష్ఫలితాలకు, ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే పరిశ్రమల నిర్మాణాలకు వ్యతిరేకంగా పోరాడటంతో పాటు, సామ్రాజ్యవాదుల యుద్ధప్రయోజనాలకు కొమ్ముగాసే భారత దళారీ పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఉద్యమించాలి. H

# గిరిపురం ప్రజలపై మోపిన విద్యుత్తుచార్జీల, అక్రమ భారాల రద్దుకై ఆందోళన


అక్రమ విద్యుత్తుభారాల రద్దుకై ప్రదర్శన

**విజయవాడ, 18-6-2013 :**

విజయవాడ నగరం, గిరిపురంలోని కుటుంబాలకు గత ఫిబ్రవరి వరకు 500రూ-600రూ॥ల వరకు విద్యుత్తు బిల్లులు వస్తుండేవి. అలాంటిది మార్చి నెల నుంచి, 30వేలు, 25వేలు, 20వేలు, 15వేల రూపాయల చొప్పున బిల్లులురావడంతో స్థానిక ప్రజల్లో తీవ్రమైన ఆందోళన వ్యక్తమైంది. వీరంతా ప్రధానంగా దళిత విభాగానికి చెందినవారు. రాడ్ బెండింగ్, తాపీపని మొ॥లగు చేతివృత్తులు చేసుకుని జీవిస్తున్నారు. ప్రతినెలా క్రమంతప్పకుండా బిల్లులు కడుతూవస్తున్నారు. మార్చినెల నుంచి బిల్లులు వేలాదిరూపాయలు అధికంగా రావటాన్ని నిరసిస్తూ వారంతా ఆందోళన మార్గం చేపట్టారు. సర్‌ఛార్జి కలిపి వస్తున్న బిల్లుల మొత్తంచూసి వినియోగదారులు షాక్‌కి గురౌతున్నారు. ఇంధన సర్దుబాటు ఛార్జీల అధికభారాన్ని నెలవారీ భరించటమే తీవ్ర భారమౌతున్న సామాన్య, మధ్యతరగతి, పేదవర్గాలపై ప్రభుత్వం ఈవిధంగా అక్రమ భారాలు మోపుతోంది. ప్రజలంతా ప్రదర్శనగా వెళ్ళి విద్యుత్తుశాఖ అధికారులను నిలదీయగా, బకాయిలు కడితేనే ప్రస్తుత బిల్లులు కట్టించుకుంటామని అన్నారు. ప్రజలను రోజుల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటూ, మానసిక వేదనకు గురిచేశారు. 'వెంటనే అక్రమ బకాయిలు రద్దుచేసి నెలవారి బిల్లులు కట్టించుకోండి. లేనియెడల ఆందోళనను తీవ్రతరం చేస్తామని' హెచ్చరిస్తూ ఏడిఇ కార్యాలయం వద్ద ఓపిడిఆర్, ఎన్‌వైయస్‌ల ఆధ్వర్యంలో ఆందోళనసాగించి వేలరూపాయల బిల్లులను తాత్కాలిక నిలుపుదలచేస్తూ అధికారులనుండి హామీ పొందారు. ఆ బిల్లులను శాశ్వతంగా రద్దుచేయాలని ఓపిడిఆర్ రాష్ట్రఅధ్యక్షుడు కా॥ కె.ఏసు, ఎన్‌వైయస్ నగరనాయకులు కా॥ వి.లక్ష్మణ ఇంకా నాగరాజు, శామ్యూలు, సహదేవుడు, జాన్‌వెస్లి తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. H

# 'యువతను పెడదారి పట్టిస్తున్న పాలకుల విధానాలపై పోరాడాలి'

## నెల్లూరుజిల్లా ఎన్.వై.ఎస్ మహాసభలో వక్తలపిలుపు

**రాపూరు, 2-6-2013 :**

చైతన్యవంతమైన సమాజం కోసం పాటుపడాల్సిన యువకుల్ని పాలకులు పథకం ప్రకారం పెడత్రోవ పట్టిస్తున్నారని జనవిజ్ఞానవేదిక రాష్ట్రనాయకులు జి.మాల్యాద్రి విమర్శించారు. రాపూరు హిందూ పాఠశాల ఆవరణంలో జరిగిన నవయువ సమాఖ్య(ఎన్.వై.ఎస్) జిల్లామహాసభలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో మంచికి-చెడుకి మధ్య సంఘర్షణ జరుగుతూ వుందని, దోపిడీవర్గ పాలకపార్టీలు యువతని చెడుమార్గంలో నడిపిస్తుండగా సమాజప్రగతిని కాంక్షించే సంస్థలు మంచి భావాలను వ్యాప్తిచేస్తున్నాయని అన్నారు. దోపిడీని, అన్యాయాన్ని ప్రశ్నించనీకుండా మద్యం, మత్తుపదార్థాల మత్తులో యువతని పాలకులు ముంచెత్తుతున్నారని ఆయన పేర్కొన్నారు. బహుళజాతి కంపెనీలు కూడా టి.వి., సినిమా సాధనాల ద్వారా ప్రజలని అనునిత్యం తమవశం చేసుకుంటూ మార్కెట్‌ని విస్తరించుకుంటున్నాయన్నారు. మన సినిమాహీరోల, క్రికెట్ ఆటగాళ్ళ ద్వారా ప్రచారం చేసుకుని పురుగుమందులున్న కూల్‌డ్రింక్స్ అలవాటుచేసి కోట్లరూ॥ల వ్యాపారం చేసుకుంటున్న పెప్సి, కోకాకోలాలకి దూరం కావాల్సి వుందని తెలిపారు. తమ చిన్నతనంలో రైతేరాజు అనే సామెత వుండేదని, నేడు రైతు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల కంపెనీలకి బానిసయ్యాడని, ఏవిత్తనం వెయ్యాలో, ఏ మందు చల్లాలో విదేశీ కంపెనీలే నిర్ణయిస్తున్నాయని, మనపై అనేకరకాల గద్దలు బహుముఖంగా దాడిచేస్తున్నాయని ఈ గద్దల్ని కనిపెట్టి వాటికి వ్యతిరేకంగా మనం సంఘటితంకావాలని పిలుపునిచ్చారు.

ఎన్.వై.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ఎస్‌కె. బాషా మాట్లాడుతూ క్రికెట్ క్రీడను జూదంలా మార్చిన పాలకులు యువతని ఆ మత్తులో వుంచుతున్నారని అన్నారు. యువత గ్రామాల్లోకెళ్ళి రైతుల సమస్యలు, పట్టణపేదల, కార్మికుల స్థితిగతులెలావున్నాయో అధ్యయనం చేసి వాటి పరిష్కారం కోసం పోరాడాలని తెలిపారు.

ఎన్.వై.ఎస్ రాష్ట్రనాయకులు కా॥ఎ.సతీష్ మట్లాడుతూ నేటియువత నిరుద్యగ సమస్యతో సతమతం అవుతూవున్నా రాజీవ్‌యువకిరణాలు లాంటి బూటకపు పథకాలతో కాలంగడుపుతూ వున్నారన్నారు. రాష్ట్రంలో ఖాళీగావున్న 3లక్షల ఉద్యోగాలను భర్తీచేయాలని డిమాండ్‌చేశారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లాకార్యదర్శి కా॥ జి.సునీత మాట్లాడుతూ గ్రామీణ యువకులకు సరైన ఉపాధి లేక పట్టణాలకు వలసలు వెళ్ళాల్సిన దుస్థితి నెలకొందని, ఉపాధిహామీపథకం ద్వారా నామమాత్రపు వేతనం లభించుతుండటంతో ఉపాధికి ఇది పరిష్కారం కాదని, వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుండి బయటపడ వేయటం ద్వారానే శాశ్వత ఉపాధి సాధ్యమన్నారు. ఈ సభలో ఎన్.వై.ఎస్ రాష్ట్రనాయకులు కా॥లక్ష్మిరెడ్డి, జిల్లా నాయకులు కా॥ ఆర్.పెంచలయ్య; బి.ప్రసాద్, ప్రదీప్, నాగరాజు, కోటేశ్వరరావులు ప్రసంగించారు. 120మంది ప్రతినిధులు వివిధ గ్రామాల నుండి పాల్గొన్నారు. జిల్లా మహాసభలో జిల్లా అధ్యక్షులుగా పెంచలయ్య, కార్యదర్శిగా బి.ప్రసాద్‌తో సహా 9మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. H

(6వపేజీ తరువాయి) ఈ రోగాలకు వైద్యం చేయించుకోవటం ఊహకందని విషయంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా వీరికి వైద్యం అందటంలేదు. ఎబిసి టాబ్లెట్‌లు, రంగునీళ్ళే పేదలకు అక్కడ అందే వైద్యం. ఆర్థికస్థోమతలేని పేదలు ఆసుపత్రులకు వెళ్ళే శాతం చాలా తక్కువే. నాటు వైద్యమే వారికి దిక్కు. ఈ విషయాన్నే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ నివేదిక తెలిపింది. ఎస్సీల్లో 3శాతం, ఎస్టీల్లో రెండు శాతంమంది మహిళలకు మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరుగుతున్నాయని ప్రైవేటు ఆసుపత్రులలో ఈ సంఖ్య ఇంకా తక్కువని, సిజేరియన్ ఆపరేషన్లు 2%లోపే చేయించుకొంటున్నారని సర్వే నివేదిక వెల్లడించింది.

ఇంకా ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సర్వే నివేదిక పేర్కొంది. రాష్ట్రంలో విద్యుత్ సౌకర్యంలేని, ఎస్సీ కుటుంబాలు 49,562, ఎస్టీ కుటుంబాలు 23,191 వున్నాయని; 10శాతం ఎస్సీ, 18 శాతం ఎస్టీ కుటుంబాలు కిరోసిన్ దీపంతోనే రాష్ట్రంలో గడుపుతున్నాయని నివేదిక వెల్లడించింది. వీరి పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందటంలేదని, నాలుగు శాతం ఎస్సీలు, ఐదుశాతం ఎస్టీ కుటుంబాలకు చెందిన విద్యార్థులు మధ్యలోనే చదువు మానివేస్తున్నారని, బడికి వెళ్లని పిల్లల సంఖ్య కూడా ఎక్కువగా వుందని, ఎస్సీల్లో 20%, ఎస్టీల్లో 12% కుటుంబాలే వంటగ్యాస్‌ని ఉపయోగిస్తున్నాయని 79 శాతం ఎస్సీలకు, 85శాతం ఎస్టీల కుటుంబాలకు మరుగు దొడ్ల సౌకర్యం లేదని నివేదిక వెల్లడించింది.

గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) సంస్థ నివేదికను గమనిస్తే పాలకులు తెచ్చే చట్టాలు, సంస్కరణలు, పథకాలు ప్రజలను పోరాటమార్గం నుంచి మళ్లించి, తన చుట్టూ తిప్పుకొంటూ రాజకీయ లబ్ధికోసం చేస్తున్నవే తప్ప వాటిని చిత్తశుద్ధితో అమలు జరిపే ఉద్దేశం లేదన్న వాస్తవం మరొకసారి వెల్లడైంది. H

# 'నవసమాజ నిర్మాణానికి యువత నడుం బిగించాలి!'

**మంగళగిరి, 9-6-2013 :**

నవయువసమాఖ్య మంగళగిరి పట్టణకమిటీ ఆధ్వర్యంలో 9-6-2013న స్థానిక విజిటియం & ఐవిటిఆర్ డిగ్రీకళాశాల ఆవరణలో పట్టణసభ జరిగింది. ఈ సభకు ఎన్‌వైయస్ జిల్లా నాయకులు కా॥ వి.దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన ఎన్‌వైయస్ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కా॥ కె.శ్రీను మాట్లాడుతూ సమాజంలో అసమానతలు, అవినీతి, పేదరికం పెరిగిపోతూ వున్నాయని, పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ప్రజల జీవన పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయని అన్నారు. సమాజానికి చైతన్యాన్ని అందించాల్సిన యువతరం విషసంస్కృతి కోరల్లో, నిరుద్యోగసమస్య, అవిద్య సమస్యలతో, వ్యసనాలచేతిలో బందీలుగా చిక్కి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. దోపిడీ, పీడనలతో నిండిన ఈ వ్యవస్థ మార్పుకు, నూతన సమాజ నిర్మాణానికి యువత కంకణబద్ధులు కావాలని సంఘాల్లో సమీకృతులు కావాలని అన్నారు.

స్త్రీవిముక్తి సంఘటన రాష్ట్రకార్యవర్గ సభ్యులు కా॥ కె.అజిత మాట్లాడుతూ సమాజంలో పతన విలువలను, సంస్కృతిని పెంచి పోషిస్తున్న పాలకులు యువతరాన్ని టార్గెట్‌చేసి అమలుచేస్తున్న విధానాల ఫలితంగా యువతలో నేరప్రవృత్తి పెరుగుతున్నదని అన్నారు. ఇటీవలి వరుస ఘటనలను పరిశీలిస్తే స్త్రీలపై, విద్యార్థినులపై హత్యలు, అత్యాచారాల ఘటనల్లో నేరస్థులుగానూ, దొంగలుగానూ, డబ్బుకోసం హత్యలు చేసే హంతకులుగానూ యువత తయారు చేయబడుతున్నారన్నారు. పాలకుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా యువత చైతన్యవంతులు కావాలని, సమాజాన్ని బాగుచేసేందుకు క్రమశిక్షణగల సైనికుల్లా మారాలని అన్నారు.

ఈ సభలో ఎన్‌వైయస్ జిల్లా అధ్యక్షుడు కా॥ డి.ప్రసాద్, పిడిఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. బాజీసైదా సందేశాలిచ్చారు. సభ 14 తీర్మానాలను ఆమోదించింది. ఈ సభలో వి.దుర్గాప్రసాద్ అధ్యక్షులుగా, కె.బాజి కార్యదర్శిగా మరో 9మంది కమిటీ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. H


రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)
వార్షిక సంచిక - 2012
వెల : రు. 50/-
కాపీలకు : మైత్రీబుక్‌హౌస్
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2



# 'లక్షింపేట దళితుల నెత్తురింకిన భూములనే వారికి కేటాయించాలి'

## లక్షింపేటలో దళిత మృతవీరుల మొదటి వర్ధంతి సభలో వక్తల డిమాండ్



దళిత మృతవీరుల సమాధుల వద్ద శ్రద్ధాంజలి; జోహార్లర్పిస్తున్న ప్రజానీకం; వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న యస్.ఝాన్సి

**లక్షింపేట, 12-6-13 :**

శ్రీకాకుళంజిల్లా - లక్షింపేటలో దళితులపై హత్యాకాండ జరిగి సంవత్సరం పూర్తయిన సందర్భంగా, దళిత మృతవీరుల మొదటివర్ధంతి సభ 'లక్షింపేట దళితపోరాట సంఘీభావకమిటీ' ఆధ్వర్యంలో ఇదే గ్రామంలో స్థానిక నాయకుడు రవి అధ్యక్షతన జరిగింది.

సంఘీభావకమిటి ఏర్పాటు నాటి నుండి దానికి నాయకత్వం వహిస్తున్న ప్రముఖ న్యాయవాది శ్రీ బొజ్జా తారకం అనారోగ్యకారణాల వల్ల ఈ సభకు రాలేకపోయారని చెపుతూ, సంఘీభావకమిటీ తరపున ముఖ్యమంత్రికి శ్రీ తారకం రాసిన బహిరంగలేఖను యు.భీమ్‌రావు చదివి వినిపించారు. అందులో ఆయన గత సంవత్సరకాలంగా 'సంఘీభావకమిటీ' ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాపితంగా లక్షింపేట దళితుల డిమాండ్స్ పరిష్కారం కొరకు-ముఖ్యంగా మడ్డువలస రిజర్వాయర్‌లో మునకకు గురికాని భూములపై దళితులకు హక్కు కల్పించాలని కోరుతూ - సాగించిన కార్యక్రమాలనన్నీ పేర్కొంటూ, ఈనాటికైనా ప్రభుత్వం ఈ డిమాండ్‌ను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

పోరాట సంఘీభావకమిటి కో-కన్వీనర్ యస్. ఝాన్సి మాట్లాడుతూ దళితుల నెత్తురింకిన భూములు వారికి దక్కేదాకా పోరాడాలన్నారు. రక్తం చిందిననేల బాధితుల జన్మహక్కు అనీ నష్టపరిహారంతోపాటు భూసాధనే ప్రధాన ధ్యేయంగా ఉండాలన్నారు. 250 ఎకరాల భూమి దక్కేవరకు దళితులు, పీడితులంతా సమైక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు.

మడ్డువలస ప్రాజెక్టు మునక భూములు కాకుండా వేరొకచోట భూమి కొనుగోలుచేసి ఇస్తామని స్థానిక శాసనసభ్యులు, రాష్ట్రమంత్రి కొండ్రుమురళి చెప్పటాన్ని పోరాట సంఘీభావకమిటీ కో-కన్వీనర్ దుడ్డు ప్రభాకర్ తీవ్రంగావిమర్శించారు. బొత్ససత్యనారాయణ, కొండ్రు మురళిలు బాధితులపక్షం కాకుండా హంతకులపక్షం, కులదురహంకార పెత్తందార్లపక్షం వహిస్తున్నారని చెప్పారు.

సంఘీభావ కమిటీ కో-కన్వీనర్ గెడ్డెం ఝాన్సి మాట్లాడుతూ దళితుల పోరాటాన్ని విచ్ఛిన్నం చేస్తున్న శక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని, దళారులను ఎండగట్టాలన్నారు. బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాటం సాగించటంలో ప్రజాస్వామిక శక్తులు కలిసిరావాలన్నారు.

ఇంకా ఈ సభలో కోటి (ప్రజాకళామండలి), డా॥ సి.విజయ (స్త్రీవిముక్తి సంఘటన), క్రాంతి (ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ), కె. రామలింగం (శోషిత్ జనసభ), జె.శ్రీనివాస్ (ఎంఆర్‌పిఎస్), ఎర్రమల్ల రాములు (మాల మహానాడు), నూకతోటి బాబూరావు (ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ), గనుమల జ్ఞానేశ్వర్ (ఆర్‌పిఐ), కె.ఏసు (ఓపిడిఆర్), డి.వర్మ, టి. అరుణ (రైతుకూలీసంఘం ఆం.ప్ర.) తదితరులు పాల్గొని కులదురహంకార హంతకదాడులలో కనుమూసిన అమరులకు జోహార్లర్పించటంతోపాటుగా భూమి సమస్య పరిష్కారమయ్యేంతదాకా ఆందోళనను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రజాకళాకారులు, దళితకళామండలి కళాకారులు లక్షింపేట అమరులపై గీతాలాలపించారు.

అదేరోజు ఉదయం, లక్షింపేట గ్రామంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ సౌరబేగౌర్ డా॥బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ లక్షింపేట దళితులకు ఎంత ఖర్చైనా వెనుకాడకుండా మరోచోట భూమి కొనిస్తామని ప్రకటించాడు. దీనితో బాధితులు, వివిధ సంఘాల కార్యకర్తలు కలెక్టరుకు తమ నిరసన తెలిపారు. దళితుల నెత్తురింకిన మడ్డువలస ప్రాజెక్టు భూములే తమకు కావాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. అది తన చేతుల్లో లేదని పైస్థాయిలో నిర్ణయం తీసుకోవలసి వుందని ప్రకటించి, కలెక్టర్ తప్పుకున్నారు.

అనంతరం లక్షింపేట దళితపోరాట సంఘీభావ కమిటీ సభ్యసంఘాల ప్రతినిధులు, అమరుల కుటుంబ సభ్యులు, గ్రామప్రజలు, వివిధ ప్రాంతాల నుండి సభకు హాజరైనప్రజలు ప్రదర్శనగా తరలివెళ్ళి నివర్తి సంగమేసు, నివర్తివెంకట్రావు, చిత్తిరి అప్పడు, బొడ్డూరి పాపయ్య మరియు నివర్తిరావులమ్మల సమాధుల వద్ద పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. భూముల సాధనకు కృత నిశ్చయంతో ముందుకుసాగుతామని ప్రతినబూనారు. H

# విత్తన సేకరణలో ప్రభుత్వ వైఫల్యం

**తొలకరి** జల్లులతో రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ముందుగానే రుతుపవనాలు వచ్చి తగినవిధంగా వర్షాలుపడటంతో దుక్కులుప్రారంభించి నారుమళ్ళకు సిద్ధమౌతున్న రైతాంగానికి విత్తనాల సమస్య ఆందోళన కలిగిస్తున్నది.

సేద్యంలో విత్తనాలు కీలకమైనవి. నాణ్యమైన విత్తనాలతోనే ఎక్కువ దిగుబడులు వస్తాయి. విత్తన పంపిణీని రాష్ట్రప్రభుత్వం ఒక ప్రహసనంగా మారుస్తున్నది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు రైతులకు కావాల్సిన విత్తనాలన్నింటినీ సిద్ధం చేశామని, విత్తన కొరతలేదని ప్రతిసంవత్సరం ప్రభుత్వం ప్రకటిస్తూనే ఉంది. ఆచరణలో విఫలమౌతూ వస్తున్నది. విత్తనాలు దొరక్క రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. విత్తనాల కోసం వీధి పోరాటాలు చేయాల్సి వస్తున్నది. అధికధరలుపెట్టి వ్యాపారుల వద్ద కొనాల్సిన పరిస్థితి, నాసిరకం విత్తనాలతో నష్టపోతున్న పరిస్థితి రైతులకు ఏర్పడుతున్నది. ఈ సంవత్సరం అదే పరిస్థితి ఏర్పడనుంది.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 7.50లక్షల క్వింటాళ్ళ వేరుశనగ, 3.46లక్షల క్వింటాళ్ళ వరి, లక్షన్నర క్వింటాళ్ళ సోయాబీన్ విత్తనాలతో అన్నిరకాల పంటలకు సంబంధించిన 19.50లక్షల క్వింటాళ్ళ విత్తనాలను సబ్సిడీ ధరపై సరఫరా చేయనున్నామని, వీటి ధర 308కోట్లని ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 50లక్షల క్వింటాళ్ళదాకా విత్తనాలు అవసరమౌతాయి. దీన్ని గమనిస్తే బయట మార్కెట్‌లోనే రైతులు ఎక్కువగా కొనాల్సివస్తున్నది. ఇవికాక మరో 31లక్షల బి.టి.పత్తి విత్తనాలను అందించే ఏర్పాట్లుచేస్తున్నట్లు కూడా వ్యవసాయశాఖ ప్రకటించింది. రైతులకు రాయితీతో విత్తనాలు అందిస్తామని చెప్పిన వ్యవసాయశాఖ అందుకు అనుగుణంగా విత్తనసేకరణ చేయటంలో విఫలమైంది. మే15నాటికివిత్తనసేకరణ పూర్తి కావాల్సి ఉండగా ఇంతవరకు పూర్తికాలేదు. రాష్ట్రవిత్తనాభివృద్ధి సంస్థను, మార్క్‌ఫెడ్‌ను అందుకు సన్నద్ధం చేయలేక పోయింది. చాలీచాలని విత్తనాలు కూడా ఇప్పటికీ అన్ని జిల్లాలకు అందించలేదు. ఇవికూడా రైతులు కోరుకున్న విత్తనాలు కాకుండా వేరే విత్తనాలు కావటంతో రైతులు వాటిఎడల తీవ్రవ్యతిరేకతను వ్యక్తంచేస్తున్నారు. తెలంగాణ జిల్లాల్లో విత్తన కొరత తీవ్రంగా ఉండి రైతుల్లో ఉద్రిక్తతకు దారితీస్తున్నది.

వ్యవసాయశాఖ రైతాంగానికి ఇస్తున్న సబ్సిడీ విత్తనాల్లో నాణ్యతలోపించిందని, మొలక సరిగాలేదని గత రెండు మూడు సంవత్సరాలుగా రైతాంగం ఆందోళనలు చేశారు. నష్టపరిహారంకోసం వ్యవసాయ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. రైతాంగానికి యిచ్చే విత్తనాలను రాష్ట్రవిత్తనాభివృద్ధి సంస్థ, మార్క్‌ఫెడ్‌లు తాము పండించటమో, రైతులచేత ఉత్పత్తి చేయించటమో చేయాలి. ఆ బాధ్యతను ఈ సంస్థలు నెరవేర్చటంలేదు. భూ కామందుల నుండి విత్తనాలు కొనుగోలు చేసి నామమాత్రపు శుద్ధిచేసి రైతులకు అంటగడుతున్నారు. ఆ విత్తనాలు మంచివా, కాదా అన్న పరిశీలన కూడా చేయకపోవటం వలనే, నాసిరకం విత్తనాలు చోటుచేసుకుని రైతులను నష్టపరుస్తున్నాయి. రైతాంగం కొన్ని రకాల విత్తనాలనే కోరుకోవటంతో వాటిని వ్యాపారులు బ్లాక్‌చేసి అధికధరలకు అమ్ముతున్నారు. రైతుల అవసరాలను ఆసరా చేసుకొని అదే బ్రాండ్లతో నాసిరకం విత్తనాలు అమ్మి సొమ్ముచేసుకుంటుంటే, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత సంవత్సరం కొన్నిరకాల బి.టి. విత్తనాలకు డిమాండ్ రావటంతో అధికధరలు, నాసిరకం విత్తనాలు రాజ్యమేలి అసలు మొక్కలే మొలవని పరిస్థితి, మొక్కలు మొలిచినా కాయలుపడని పరిస్థితిని రైతులు చాలా ప్రాంతాల్లో ఎదుర్కొన్నారు. పత్తిసాగు ఖర్చులుపెరగటం, దిగుబడులు, గిట్టుబాటు ధర లేకపోవటం వలన నష్టాలపాలౌతున్న రైతులు, మరో పంటలపై మొగ్గుతున్నారు. ముఖ్యంగా సోయాబీన్, మొక్కజొన్నసాగుకి సిద్ధమౌతున్నారు. దీనిఫలితంగా ఈ విత్తనాల అవసరం ఎక్కువగా ఉంది. మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోనే 1.83లక్షల క్వింటాళ్ళ సోయాబిన్ విత్తనాల అవసరం వుంది. రాష్ట్రవ్యాపితంగా వ్యవసాయశాఖ సబ్సిడీపై యిచ్చే విత్తనాలు 1.5లక్షల క్వింటాళ్ళు మాత్రమే. ఇవి రైతాంగానికి ఏమాత్రం చాలవు. లక్షల క్వింటాళ్ళ విత్తనాలను ప్రైవేటు వ్యాపారుల వద్ద రైతులు కొనుగోలు చేయాలి. దీన్ని ఆసరాచేసుకొని వ్యాపారులు అధికరేటుకి అమ్మి రైతులను దోచుకొనేందుకు సిద్ధమౌతున్నారు.

అధికధరలు, నాణ్యతలేని విత్తనాల సమస్య ముందుకు వచ్చినప్పుడల్లా వాటి ధరలను నియంత్రిస్తామని, నకిలీవిత్తన వ్యాపారులపై కఠినచర్యలు తీసుకుంటామని అందుకు కొత్తవిత్తన చట్టాల్ని రూపొందిస్తున్నామని ప్రభుత్వం రైతులకు నమ్మపలికే మాటలు చెబుతున్నది. ఆచరణలో మాత్రం అమలులో పెట్టటంలేదు. రైతుల ఆందోళన ఫలితంగా కొత్తవిత్తన చట్టముసాయిదాని (దానిలో అనేక లోపాలున్నాయి.) తయారుచేసి, అసెంబ్లీలో దాన్ని ఆమోదించి, కేంద్రం పరిశీలనకు పంపగా అది అక్కడే ఆగిపోయింది. సంవత్సరాలు గడుస్తున్నా ఆచట్టం గురించి కేంద్రాన్ని అడగటంకాని, దాన్ని అమలుపర్చే చర్యలు గురించి గాని మాట్లాడటంలేదంటే చట్టం ఎడల వారి చిత్తశుద్ధి వెల్లడౌతున్నది.

విత్తనాలపై నామమాత్రపు సబ్సిడీయిస్తున్న ప్రభుత్వం వాటి ధరలను ఈ సంవత్సరం విపరీతంగా పెంచింది. రాయితీ విత్తనాల ధరలను పెంచుతూ మే నెల మూడో వారంలోనే ప్రభుత్వం ఉత్వర్వులు జారీచేసింది. ఈ విషయం రైతులకు తెలియకుండా గోప్యంగా ఉంచింది. విత్తనాలు కొనుగోలు చేసేందుకు ఏ.పి.విత్తనాభివృద్ధి సంస్థ ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు వెళ్ళినప్పుడు మాత్రమే ఆ విషయం బహిర్గతమైంది. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పెంచిన ధరల ప్రకారం వరి విత్తనాల ధర 250 నుండి 300రూ॥కు పెరిగింది. గతసంవత్సరం బి.పి.టి వరివిత్తనాలు 2300రూ. ఉండగా సబ్సిడీ 600పోనూ 1700లకు విక్రయించారు. ఇప్పుడు ఆ విత్తనాలు సబ్సిడీపోనూ 2300రూ॥లకు అమ్ముతున్నారు. అంటే క్వింటాల్‌కు 600 పెంచారు. ఎం.టి.యు 1001రకం 2000 నుండి 2250కు, 1061రకం 2వేలరూ॥ల నుండి 2,300కు; ఎం.టి.యు 7029రకం 2100 నుండి 2300రూ॥కు పెంచారు. ఆర్.జి.ఎల్ 2537 రకం పత్తివిత్తనాలు 2300 నుండి 2600రూ॥కు పెంచారు. గత సంవత్సరం కంది విత్తనాలు 5600రూ ఉండగా ఈ సంవత్సరం 5800రూ, పెసరవిత్తనాలు 6500 నుండి 6800 రూ॥లకు పెంచారు. ఇంకా జీలుగ, జనుము, పిల్లిపిసర విత్తనాల ధరలను కూడా పెంచారు. ఈ విధంగా ప్రభుత్వం రైతులపై వందల కోట్ల భారాన్ని మోపింది.

తన పంట నుండి విత్తనాలు సమకూర్చుకుని తను వినియోగించుకోవటమే కాకుండా తోటిరైతులకు వాటిని యిచ్చేవారు. ఆవిధంగా విత్తనకొరత తెలియని రైతులను విత్తనాలు కొనుగోలు చేసేవారిగా విత్తనకొరత ఎదుర్కొనే దుస్థితిలోకి ప్రభుత్వం పడదోసింది.

2013-14 సంవత్సర సీజన్‌లో 225లక్షల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకొన్న ప్రభుత్వం, విత్తనాలు, ఎరువుల ధరలు పెంచుతూ, మేలురకమైన విత్తనాలు అందించకపోగా, రైతులకు పంటరుణాలు ఇవ్వకుండా రైతులకు సేద్యాన్ని భారంగా మారుస్తూ ఉంటే, పంటల ఉత్పత్తి లక్ష్యం నెరవేరటం అసాధ్యం. ప్రభుత్వ గొప్పలకే అది పరిమితమౌతుంది.

దేశంలో స్వతంత్ర వ్యవసాయ విధానం లేకుండా, దేశీయ విత్తనాలను అభివృద్ధి చేయకుండా, బహుళజాతి సంస్థల విత్తనాలను నిషేధించకుండా, వ్యవసాయ రంగంలో సామ్రాజ్యవాద దోపిడీని అంతం చేయకుండా ఉన్నంతకాలం దేశంలో, రాష్ట్రంలో రైతాంగం విత్తనాల సమస్యను ఎదుర్కొంటూనే ఉంటారు. ఈ వాస్తవాన్ని రైతాంగం గ్రహించి పోరాటానికి సిద్ధంకావాలి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కి అన్నిరకాల విత్తనాలకు సబ్సిడీ పెంచి ప్రభుత్వమే సరఫరా చేయాలని ఉద్యమించాలి. H

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010